ANN తెలుగు


Follow: @ANNTELUGU

05-04-2026

# మహా పత్రిక

ఆదివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 98 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏఎన్ఎన్ మహా అవార్డుల వేడుకకు మంత్రి దామోదర రాజనర్సింహ

*ఆహ్వానించిన సంస్థ సీఈవో కంది రామచంద్రారెడ్డి*

**హైదరాబాద్, మహా:** ఏఎన్ఎన్ ఛానల్ , మహా పత్రిక ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని పురస్కరించుకుని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఏఎన్ఎన్ మహా అవార్డుల వేడుక కార్యక్రమానికి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి దామోదర రాజనర్సింహను ఏఎన్ఎన్ ఛానల్, మహా పత్రిక సీఈవో కంది రామచంద్రారెడ్డి శనివారం ఆహ్వానించారు. ఈనెల 11న హైదరాబాద్ లోని కత్రియా హోటల్ లో వైద్య రంగంలో విశేష సేవలందించిన పలువురు డాక్టర్లు, ఆస్పత్రుల యాజమాన్యాలను, బిజినెస్ లో దూసుకుపోతున్న స్ఫూర్తిదాయకలీడర్లను అవార్డుతో సత్కరించనున్నట్లు వివరించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వారోత్సవాల నేపథ్యంలో హెల్త్ కేర్ అవార్డులు ఇవ్వడం అభినందనీయమని మంత్రి అన్నారు.

**టాప్ న్యూస్**



### రాహుల్ తో కలిసి పొంగులేటి

- కేరళలో విజయానికి మంత్రి వ్యూహాలు

02

### డెల్ పై ఇరాన్ ఉగ్ర ముద్ర

- డెల్ కంపెనీ ఉగ్రవాద సంస్థగా ప్రకటన
- 18 అమెరికన్ కంపెనీలే లక్ష్యంగా ఐఆర్జీసీ హెచ్చరికలు

02

### స్థలం ఇస్తావా.. బుల్డోజర్ పంపమంటావా?



- గోపాల్ నగర్‌లో బడా బాబుల హల్చల్..
- యూఎల్సీ భూములపై కబ్జాదారుల కన్ను!
- హైడ్రా ముసుగులో భూ రాబందుల కొత్త 'స్కెచ్'

02



# కాంగ్రెస్ గాలిలో పాయల్ శంకర్ కొట్టుకుపోతాడు

## వెనుకబడిన ఆదిలాబాద్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

- ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ పటిష్టంగా ఉంది
- ఈ ప్రాంతంపై ప్రత్యేక వ్యూహంతో ముందుకు సాగుతాం
- డీసీసీల సమావేశంలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలు

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పటిష్టంగా ఉందని, రేపు వీచే గాలిలో పాయల్ శంకర్, హరీష్ లు కొట్టుకుపోతారని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తో కలిసి ఆదిలాబాద్ జిల్లా పర్యటకు వచ్చారు.స్థానిక పంచవటి హోటల్లో డీసీసీ అధ్యక్షుడు నరేష్ జావ్ అధ్యక్షతన జరిగిన జిల్లా కాంగ్రెస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారకార్యక్రమానికి ,పొలిటికల్ యాక్షన్ కమిటీ సమావేశానికి హాజరయ్యారు. రేపు వీచే కాంగ్రెస్ గాలిలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, హరీష్‌లు తుఫాన్ లో కొట్టుకుపోతారని, గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఈ విషయాన్ని పూర్తిగా విస్మరిస్తోందని విమర్శించారు. వెనుక బడిన ఆదిలాబాద్ పై సీయం ప్రత్యేక దృష్టి పెట్టినట్టు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా బీజేపీ బీఆర్ ఎస్ లపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ అప్పుల కుప్పగా మార్చిందన్నారు. రాష్ట్ర ప్రజల భవిష్యత్తు గురించి ఆలోచించలేదన్నారు. వారు చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ ప్రజా సంక్షేమాన్ని ఏమాత్రం విస్మరించలేదన్నారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో 23వేల కోట్ల రుణమాఫీ చేసిందన్నారు. మిగతా 2లో



### నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు
- ప్రగతిశీల రాష్ట్రాలకు రాజకీయ నష్టం జరగకుండా కొత్త ఫార్ములా

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లోనూ, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తున్న పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అత్యంత కీలకమైన వివరణ ఇచ్చారు. మిగతా 2లో



### రాష్ట్రంలో భూతగాదాలకు ఇక చెక్

- సంచలన నిర్ణయం తీసుకున్న తెలంగాణ సర్కార్
- సరికొత్త విధానానికి శ్రీకారం

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో భూ పరిపాలనను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా సర్కార్ సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టబోతోంది. ఇకపై సర్వే నంబర్ల వారీగా డిజిటల్ సర్వే పూర్తి కాకుండా రిజిస్ట్రేషన్లు నిర్వహించకూడదని భావిస్తోంది. దీనికోసం రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖలను సమన్వయం చేస్తూ భూ భారతిలో ఇంటిగ్రేటెడ్ ల్యాండ్ మేనేజ్‌మెంట్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురానుంది. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో భూమికి సంబంధించిన దస్తావేజులు ఉంటే మిగతా 2లో




### గులాబీపురాలు రెండూ బీఆర్ఎస్సే

**మహా నెట్ వర్క్:** కాంగ్రెస్ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డికి ఎదురుదెబ్బ తగిలింది. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. చెన్నూరు నియోజకవర్గం క్యాతన్ పల్లి మునిసిపాలిటీని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. రెండు పురపీఠాలు బీఆర్ఎస్ కు దక్కగా, ఖానాపూర్ ఎన్నిక వాయిదా పడింది.

## బాసర క్షేత్రానికి రూ.225 కోట్లు

### సరస్వతీ ఆలయ పునర్నిర్మాణం

6న బాసరకు సీఎం రేవంత్.. అద్భుత మాస్టర్ ప్లాన్‌కు గ్రీన్ సిగ్నల్




**హైదరాబాద్, మహా:** ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతీ ఆలయాన్ని అద్భుత ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యాచరణకు సిద్ధమైంది. ఆలయ అభివృద్ధిపై శనివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బాసర క్షేత్ర రూపురేఖలను మార్చేలా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు ఆమోదముద్ర వేశారు. భక్తుల విశ్వాసాలను గౌరవిస్తూ, ఆగమ శాస్త్ర నిబంధనలకు లోబడి ఆలయ అభివృద్ధి పనులు ఉండాలని అధికారులను ఆదేశించారు. రాబోయే దశాబ్దాల కాలాన్ని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విశాలమైన రోడ్లు, అత్యాధునిక సౌకర్యాలతో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించాలని స్పష్టం చేశారు. బాసర ఆలయ పవిత్రతను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా ఉద్ఘాటించారు.ఆలయ పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట వేయాలని సూచించిన సీఎం, అక్కడ కేవలం ఈవీ (ఎలక్ట్రిక్) వాహనాలను మాత్రమే అనుమతించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో బాసరతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల పరిసరాల్లో ఎలాంటి రాజకీయ కార్యకలాపాలకు తావు లేకుండా కఠిన నిబంధనలు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. దేవాలయాలు కేవలం భక్తి పారవశ్యానికి నిలయాలుగా ఉండాలని, అక్కడ రాజకీయ జెండాలకు, ప్రచారాలకు చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. ఆలయ పవిత్రతకు భంగం కలిగించే ఏ చర్యలనైనా ఉపేక్షించేది లేదని, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.ఈ ప్రతిష్టాత్మక అభివృద్ధి పనులకు ఈ నెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శంకుస్థాపన చేయనున్నారు. సుమారు రూ.225 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల ద్వారా బాసర క్షేత్రం సరికొత్త రూపును సంతరించుకోనుంది. మిగతా 2లో

# ఏపీకి న్యూ మ్యాప్

### 28 జిల్లాలతో విడుదల చేసిన ప్రభుత్వం

- రాజధానిగా అమరావతి.. కొత్తగా మార్కాపురం, పోలవరం జిల్లాలు
- పరిపాలన వికేంద్రీకరణే లక్ష్యంగా నూతన అధ్యాయం



**అమరావతి,మహా:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంలో మరో నూతన అధ్యాయం మొదలైంది. ప్రజలకు పాలనను మరింత చేరువ చేస్తూ, అభివృద్ధిని అన్ని ప్రాంతాలకు సమానంగా విస్తరించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేపట్టిన జిల్లాల పునర్విభజన ప్రక్రియ తుది రూపం దాల్చింది. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ రాష్ట్ర సరికొత్త మ్యాప్‌ను శనివారం అధికారికంగా విడుదల చేసింది. గతంలో ఉన్న 26 జిల్లాలకు అదనంగా మార్కాపురం, పోలవరం ప్రాంతాలను కొత్త జిల్లాలుగా గుర్తిస్తూ, మొత్తం 28 జిల్లాలతో కూడిన ఈ సరికొత్త భౌగోళిక పటాన్ని రూపొందించారు. ఈ మ్యాప్‌లో అమరావతిని రాష్ట్ర ఏకైక రాజధానిగా కేంద్ర బిందువుగా చూపిస్తూ స్పష్టమైన మార్పులను పొందుపరిచారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి పరిపాలన సౌలభ్యం ఎంతో అవసరమని భావించిన ప్రభుత్వం, భౌగోళిక పరిస్థితులు మరియు ప్రజా అవసరాలకు అనుగుణంగా ఈ రెండు కొత్త జిల్లాలను ఏర్పాటు చేసింది. ప్రకాశం జిల్లా నుంచి మార్కాపురం ప్రాంతాన్ని వేరు చేసి కొత్త జిల్లాగా మలిచారు. సుదీర్ఘకాలంగా వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పశ్చిమ ప్రకాశం ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు. అలాగే, పశ్చిమ గోదావరి మరియు ఏలూరు జిల్లాల నుంచి కొన్ని కీలక ప్రాంతాలను విడదీసి పోలవరం కేంద్రంగా నూతన జిల్లాను ఏర్పాటు చేశారు. ఈ మార్పుల ద్వారా ఆయా ప్రాంతాల్లోని గిరిజన మరియు గ్రామీణ ప్రాంతాలకు ప్రభుత్వ సేవలు మరింత వేగంగా, పారదర్శకంగా అందుతాయని అధికారులు వెల్లడించారు.ముఖ్యంగా రాజధాని అమరావతిని కేంద్ర బిందువుగా చూపిస్తూ రూపొందించిన ఈ మ్యాప్, రాష్ట్ర భౌగోళిక సరిహద్దుల్లో వచ్చిన మార్పులను కళ్లకు కట్టినట్లు తెలియజేస్తోంది. రాజధాని ప్రాంతం నుంచి మారుమూల జిల్లాల వరకు రవాణా, మిగతా 2లో

## ఇక ప్రళయమే.. ఇరాన్ ఖతం



### ట్రంప్ ఫైనల్ వార్నింగ్

**మహా:** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మరోసారి వార్నింగ్ ఇచ్చారు. హోర్మూజ్ జలసంధిని తక్షణమే ఓపెన్ చేయకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరికలు జారీ చేశారు. 'తమతో ఒప్పందం చేసుకోవడానికి లేదా హోర్మూజ్ జలసంధిని తెరిచేందుకు నేను 10 రోజుల గడువు ఇచ్చాను. సమయం మించిపోతుంది. వారిపై ప్రళయం విరుచుకుపడేందుకు ఇంకా 48 గంటల సమయం మాత్రమే ఉందని ట్రూత్ సోషల్ మీడియా ద్వారా పోస్టు చేశారు. తాజా హెచ్చరికలతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఇరాన్ త్వరగా నిర్ణయం తీసుకోకపోతే 48 గంటల్లో అంటే సోమవారం రాత్రి 8 గంటల తర్వాత సైనిక చర్య తప్పదని ట్రంప్ వార్నింగ్ ఇచ్చారు. మరోవైపు హోర్ముజ్ జలసంధి ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన మార్గం అని చెప్పొచ్చు. దీన్ని మూసివేయడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.

# కాంగ్రెస్ గాలిలో పాయల్ శంకర్ కొట్టుకుపోతాడు

(మొదటిపేజీ తరువాయి)

సన్న బియ్యం దొడ్డిదారి పెట్టకుండా పేదవాడికి చేరేలా చేసిందన్నారు. గత ప్రభుత్వం సరఫరా చేసిన దొడ్డు బియ్యాన్ని తినలేక ప్రజలు అమ్ముకున్నారని కాని సన్నబియ్యంతో ఆకలి తీర్చుకుంటున్నారని తెలిపారు.

**బీజేపీ చేసిందేమీ లేదు**

ప్రజా పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ గాలిలో బీఆర్ ఎస్ బీజేపీ కొట్టుకుపోతుందన్నారు.ఆదిలాబాద్ కు ఎయిర్ పోర్ట్ తెస్తున్నామని పరిశ్రమలు కూడా వస్తాయన్నారు. వ్యవసాయ జిల్లాను రైతులను అన్నివిధాల ఆదుకుంటామన్నారు.ఇక దేశం కోసం కేంద్రంలోని బీజేపీ ఏమీ చేయడం లేదని విమర్శించారు. ప్రజలు గద్దెనెక్కిస్తే దేశాన్ని బడాబాబులకు తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ పెట్రోల్ డీజిల్ ధరలపై నియంత్రణ కరువైందన్నారు.ప్రజల సమస్యలను గాలికొదిలేసి బీజేపీ 80లక్షల కోట్లు దండుకుందన్నారు.దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతూ దేశంలో మత విద్వేషాలు రెచ్చగొడుతుందన్నారు. అదే రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపెడుతోందన్నారు. ఆరుగ్యారంటీలు అమలు చేస్తూ ప్రజా పాలన కొనసాగిస్తుందన్నారు.దేశం కోసం త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని విమర్శించడం తప్పితే కేంద్రంలోని బీజేపీకి అభివృద్ధి జపం లేదన్నారు.దేశ స్వాతంత్ర్య కోసం పాటుపడింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఒక్క బీజేపీ నాయకుడైనా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన చరిత్ర ఉందా అని ప్రశ్నించారు. ఇక పార్టీ కోసం కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన ప్రతిఫలం ఉంటుందన్నారు. ఇందుకు తానే ఉదాహరణ అన్నారు. చిన్న కార్యకర్త స్థాయి నుండి రాష్ట్ర అధ్యక్షపదవికి ఎదిగానన్నారు. పార్టీ పరంగా కార్యకర్తలను ఆదుకుంటామన్నారు.వర్గవిబేధాలు వీడి అందరూ పార్టీ బలోపేతం కోసం పని చేయాలని సూచించారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని పదికి పది గెలిచేలా కృషి చేయాలని రాష్ట్రంలో 100 కు పైగా సీట్లు గెలిచేలా కృషి చేయాలన్నారు. సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా పార్టీ కార్యకర్తలు నేతలకు భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తున్నట్టు ఏపీఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్ తెలిపారు. పార్టీ లైన్ ప్రకారం నడుచుకొని బలోపేతం కోసం పని చేయడం ప్రతీకార్యకర్త తన బాధ్యతగా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు నరేష్ జాదవ్ ,టీపీసీసీ సెక్రటరీ ఇంద్రకరణ్ రెడ్డి , మాజీ ఎంపీ సోయం బాపురావు ,ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ కంది శ్రీనివాస రెడ్డి , బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆడే గజేందర్ ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్ శ్యామ్ నాయక్, ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నరసయ్య ,ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, మాజీ మున్సిపల్ చైర్మన్ దిగంబర్ పాటిల్,మాజీ డిసిసిబి చైర్మన్ అడ్డి బోజా రెడ్డి ,టీపీసీసీ మాజీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత గారు, తుల అరుణ్ ,జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి , ఇచ్చోడా మార్కెట్ కమిటీ చైర్మన్ కుమర సత్యవతి కోటేష్, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి ,,ఆదిలాబాద్ మాజీ డిసిసి అధ్యక్షులు సాజిద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# డెల్ పై ఇరాన్ ఉగ్రముద్ర

## డెల్ కంపెనీఉగ్రవాద సంస్థగా ప్రకటన
## 18 అమెరికన్ కంపెనీలే లక్ష్యంగా ఐఆర్‌జీసీ హెచ్చరికలు

**వాషింగ్టన్, మహా:** పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్న వేళ, ఇరాన్ ప్రభుత్వం తీసుకున్న ఒక సంచలన నిర్ణయం అంతర్జాతీయ టెక్నాలజీ రంగంలో కలకలం రేపుతోంది. అమెరికాకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ టెక్నాలజీ దిగ్గజం 'డెల్' సంస్థను ఇరాన్ అధికారికంగా ఉగ్రవాద సంస్థగా అభివర్ణించింది. ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన, సైనికపరమైన పోరు పతాక స్థాయికి చేరిన తరుణంలో, ఒక వ్యాపార సంస్థపై ఇరాన్ ఈ తరహా ముద్ర వేయడం గమనార్హం. ఈ పరిణామం కేవలం డెల్ సంస్థకే పరిమితం కాకుండా, అగ్రరాజ్యానికి చెందిన మరిన్ని దిగ్గజ కంపెనీలను టార్గెట్ చేసే దిశగా ఇరాన్ అడుగులు వేస్తోంది. ఇరాన్ ప్రకటించిన ఈ కఠిన నిర్ణయంపై డెల్ యాజమాన్యం తక్షణమే స్పందించి తన ఉద్యోగులను అప్రమత్తం చేసింది. తమ సిబ్బంది భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అంతర్గత మెమో జారీ చేసిన కంపెనీ, ఉద్యోగులెవరూ ప్రస్తుతం ఇరాన్ పర్యటనలకు వెళ్లవద్దని కఠిన ఆదేశాలు ఇచ్చింది. ఇప్పటికే ఇరాన్‌లో ఉన్న వారు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలిపోవాలని సూచించింది. అంతేకాకుండా, ఇరాన్ దేశానికి చెందిన ఏ సంస్థతో గానీ, వ్యక్తులతో గానీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎటువంటి వ్యాపార సంబంధాలు పెట్టుకోవద్దని స్పష్టం చేసింది. కంపెనీకి చెందిన డేటా మరియు నెట్‌వర్క్ భద్రతపై ఐటీ విభాగాలు మరింత అప్రమత్తంగా ఉండాలని, సైబర్ దాడులు జరిగే అవకాశం ఉన్నందున నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది.మరోవైపు ఇరాన్ రెవెల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (IRGC) చేసిన ప్రకటన అమెరికా కార్పొరేట్ వర్గాల్లో ఆందోళన నింపింది. అమెరికాకు చెందిన మొత్తం 18 ప్రముఖ ఐటీ మరియు ఫైనాన్స్ కంపెనీలే తమ తదుపరి లక్ష్యమని ఐఆర్‌జీసీ తన అధికారిక టెలిగ్రామ్ ఛానల్ ద్వారా హెచ్చరించింది. ఈ ప్రముఖ సంస్థలన్నీ అమెరికా ప్రభుత్వానికి గూఢచారులుగా వ్యవహరిస్తున్నాయని, తమ దేశ రహస్యాలను సేకరిస్తున్నాయని ఇరాన్ తీవ్ర ఆరోపణలు చేస్తోంది. గత మార్చి నెలలో ఇచ్చిన హెచ్చరికలనే పునరావృతం చేస్తూ, ఈసారి నేరుగా కంపెనీల పేర్లను ప్రస్తావించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. క్షిపణులు, డ్రోన్లతో సాగుతున్న ఈ యుద్ధం ఇప్పుడు గ్లోబల్ టెక్నాలజీ మరియు ఆర్థిక వ్యవస్థల వైపు మళ్లుతుండటంతో ప్రపంచ దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నా

# బాసర క్షేత్రానికి రూ.225 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

భక్తులకు అవసరమైన వసతి సౌకర్యాలు, క్యూలైన్ల ఆధునీకరణ, పరిసరాల సుందరీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. ఈ సమీక్షా సమావేశంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డితో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఖరారు కావడంతో అధికార యంత్రాంగం బాసరలో ఏర్పాట్లను ముమ్మరం చేసింది. దశాబ్దాలుగా నిరాదరణకు గురైన బాసర ఆలయం, రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయంతో పూర్వ వైభవాన్ని సంతరించుకోనుందని భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# ఏపీకి న్యూ మ్యాప్


(మొదటిపేజీ తరువాయి)

కమ్యూనికేషన్ మరియు పాలనాపరమైన సమన్వయం పెంచేందుకు ఈ పునర్విభజన దోహదపడనుంది. వికేంద్రీకరణే లక్ష్యంగా సాగుతున్న ఈ ప్రస్థానంలో కొత్త జిల్లాల ఏర్పాటు ఒక కీలక మైలురాయిగా నిలవనుంది. కొత్త మ్యాప్ విడుదలైన నేపథ్యంలో, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లోనూ, విద్యా సంస్థల్లోనూ దీనిని ప్రామాణికంగా వినియోగించాలని ప్రభుత్వం సూచించింది. ఈ చారిత్రాత్మక మార్పుతో రాష్ట్ర భౌగోళిక ముఖచిత్రం మారడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఆయా జిల్లాల్లో మౌలిక సదుపాయాల కల్పన మరియు పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది.

### విజయమే లక్ష్యంగా పెద్దమ్మ సన్నిధిలో

# రైజర్స్ వీరులు!

- అమ్మవారికి అభిషేక్ శర్మ, నితీశ్‌కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు
- ఐపీఎల్ 2026లో సత్తా చాటాలని మొక్కులు
- ఆలయం వద్ద అభిమానుల సందడి



**హైదరాబాద్, మహా:** ఐపీఎల్ 2026సీజన్‌లో సొంత గడ్డపై వరుస మ్యాచ్‌లతో బిజీగా ఉన్న సన్‌రైజర్స్ హైదరాబాద్ యువ కెరటాలు శనివారం ఆధ్యాత్మిక బాట పట్టారు. జూబ్లీహిల్స్‌లోని ప్రసిద్ధ పెద్దమ్మ తల్లి దేవాలయాన్ని జట్టు స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ, ఆల్‌రౌండర్ నితీశ్‌కుమార్ రెడ్డి సందర్శించారు. శనివారం ఉదయం ఆలయానికి చేరుకున్న ఈ ఇద్దరు క్రికెటర్లకు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో వెలసిన అమ్మవారిని దర్శించుకున్న క్రీడాకారులు, శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ఐపీఎల్ ఫీవర్ కొనసాగుతున్న తరుణంలో, కీలకమైన మలిదశ మ్యాచ్‌ల్లో విజయం సాధించాలని, జట్టుకు ఎటువంటి ఆటంకాలు కలగకూడదని వారు మనస్ఫూర్తిగా ప్రార్థించారు. దర్శనానంతరం వేద పండితులు వారికి ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి శేషవస్త్రం మరియు ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా అభిషేక్ శర్మ మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా ఈ ఆలయానికి రావడం తనకు ఎంతో మానసిక ప్రశాంతతను ఇస్తుందని, అమ్మవారి ఆశీస్సులతో ఈ సీజన్‌లో సన్‌రైజర్స్ అద్భుత ప్రదర్శన చేస్తుందన్న నమ్మకం తనకు ఉందని వెల్లడించారు. తన ఆల్‌రౌండ్ ప్రతిభతో అందరినీ ఆకట్టుకుంటున్న తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్ రెడ్డి కూడా భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. మైదానంలో పరుగుల వర్షం కురిపించే ఈ వీరులు, సంప్రదాయ దుస్తుల్లో ఆలయంలో కనిపించడంతో అక్కడి భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.

### రాష్ట్రంలో ఐదు 'డీ'ల

# పాలన సాగుతోంది

## రేవంత్ సర్కార్‌పై బూర నర్సయ్య గౌడ్ నిప్పులు

**హైదరాబాద్: మహా:**తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచిస్తోందని, అభివృద్ధిలో 'డీలా' పడి కేవలం ప్రచారానికే పరిమితమైందని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి తీరును 'ఇంట్లో జీరో.. బయట హీరో' అంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా తయారైందని, ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు ఇప్పుడు ఆరు మోసాలుగా మారాయని, అభయహస్తం కాస్తా భస్మాసుర హస్తంగా మారిందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలికొదిలేసి పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి, పార్టీకి మూటలు పంపడానికే ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు.ప్రస్తుత కాంగ్రెస్ పాలనను విశ్లేషిస్తూ ఇది ఒక '5D' మోడల్ అని బూర నర్సయ్య గౌడ్ అభివర్ణించారు. డైవర్షన్ (మళ్లింపు), డిమాండ్ (అధికార దర్పం), డిమాలిషన్ (కూల్చివేతలు), డెట్ (అప్పులు), డిఫాల్ట్ (వైఫల్యం) అనే ఐదు సూత్రాల మీదనే ఈ సర్కార్ నడుస్తోందని విమర్శించారు. నిత్యం ప్రజల దృష్టిని మళ్లించడం, అప్పుల మీద అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని దివాళా తీయించడం తప్ప ఈ ప్రభుత్వానికి మరో ధ్యేయం లేదని పేర్కొన్నారు. కేవలం 28 నెలల కాలంలోనే రూ.3.47 లక్షల కోట్ల భారీ అప్పు చేసి రికార్డు సృష్టించారని, కాగ్ మరియు ఆర్బీఐ నివేదికలను పరిశీలిస్తే.. గత ఆర్థిక సంవత్సరంలోని 365 రోజుల్లో 363 రోజులు ప్రభుత్వం అప్పుల మీదనే ఆధారపడి గడిపిందని గణాంకాలతో వివరించారు. ఈ ప్రభుత్వం ఒక 'దినసరి కూలీ' తరహాలో రోజువారీ అప్పులతో నెట్టుకొస్తోందని విమర్శించారు.దళిత, గిరిజన విద్యార్థుల పట్ల ఈ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అత్యంత దారుణంగా ఉందని బూర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం రూ.263 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను జమ చే



యకపోవడంతో ఆ నిధులు వెనక్కి వెళ్ళిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది విద్యార్థుల భవిష్యత్తును బొందపెట్టడమేనని మండిపడ్డారు. అలాగే ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రభుత్వం అప్పీలుకు వెళ్లకపోవడం వెనుక ఈ పథకాన్ని శాశ్వతంగా నిలిపివేసే కుట్ర దాగి ఉందని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థులు తమ ఫీజులు తామే కట్టుకోవాలనే పరిస్థితికి తీసుకురావడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని, దీనిపై విద్యార్థి లోకం తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు.టెక్స్‌టైల్ రంగంలో తెలంగాణ నంబర్ వన్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు కేవలం పగటి కలలని బూర నర్సయ్య గౌడ్ కొట్టిపారేశారు. గణాంకాల ప్రకారం కాటన్ ఉత్పత్తిలో మహారాష్ట్ర, గుజరాత్ మొదటి రెండు స్థానాల్లో ఉంటే తెలంగాణ మూడో స్థానంలో ఉందని, గార్మెంట్ తయారీ మరియు ఎగుమతుల్లో తెలంగాణ కనీసం టాప్10 లో కూడా లేదని స్పష్టం చేశారు. వాస్తవాలు ఇలా ఉంటే ఆసియాలోనే నంబర్ వన్ చేస్తామని ప్రకటనలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. వరంగల్ సమీపంలో ప్రధాని మోదీ మంజూరు చేసిన 'పీఎం మిత్ర' మెగా టెక్స్‌టైల్ పార్కును రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కేంద్ర నిధులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని విమర్శించారు.అంతర్జాతీయ స్థాయిలో ధరలు పెరిగినప్పటికీ ప్రధాని మోదీ దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాకు ఆటంకం లేకుండా చూస్తుంటే, తెలంగాణలో మాత్రం కృత్రిమ కొరత సృష్టించి ఎల్పీజీ సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు.

# స్థలం ఇస్తావా.. బుల్డోజర్ పంపమంటావా?

- గోపాల్ నగర్‌లో బడా బాబుల హల్చల్..
- యూఎల్సీ భూములపై కబ్జాదారుల కన్ను!
- హైడ్రా ముసుగులో భూ రాబందుల కొత్త 'స్కెచ్'

**హైదరాబాద్, మహా:** భాగ్యనగరంలో అక్రమ కట్టడాల వెన్నులో వణుకు పుట్టిస్తున్న 'హైడ్రా' పేరు ఇప్పుడు భూ కబ్జాదారులకు ఒక కొత్త ఆయుధంగా మారింది. ప్రభుత్వ ఆశయం గొప్పదైనా, క్షేత్రస్థాయిలో కొందరు బడా బాబులు దీనిని అడ్డం పెట్టుకుని సామాన్యులను బ్లాక్ మెయిల్ చేస్తున్న ఉదంతం కూకట్‌పల్లిలో వెలుగు చూసింది. జేఎన్టీయూ పరిధిలోని గోపాల్ నగర్‌లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న సామాన్యులను, మధ్యతరగతి జీవులను లక్ష్యంగా చేసుకుని భూ రాబందులు వేట మొదలుపెట్టాయి. "మర్యాదగా మా దారికి వచ్చి స్థలం అప్పగిస్తారా.. లేక హైడ్రాను పిలిపించి ఇళ్లు కూల్చేయమంటారా?" అంటూ కబ్జాదారులు చేస్తున్న హెచ్చరికలు ఇప్పుడు స్థానికంగా పెను కలకలం రేపుతున్నాయి.
వివరాల్లోకి వెళ్తే..గోపాల్ నగర్ పరిధిలోని యూఎల్సీ భూముల్లో సుమారు 20 నుంచి 30 ఏళ్ల క్రితమే చిరుద్యోగులు, సామాన్యులు తమ కష్టార్జితంతో ప్లాట్లు కొనుగోలు చేశారు. అప్పట్లో నిబంధనలపై పెద్దగా అవగాహన లేకపోవడంతో, రిజిస్ట్రేషన్లు నమ్మి చిన్నపాటి ఇళ్లను నిర్మించుకున్నారు. అయితే, ఈ భూములపై గత కొన్ని దశాబ్దాలుగా న్యాయస్థానంలో వివాదం నడుస్తూనే ఉంది. ఎట్టకేలకు ఇటీవల గౌరవ కోర్టు ఈ భూములకు సంబంధించి బాధితులకు అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో ఇన్నాళ్లూ కోర్టు కేసులతో సతమతమైన బాధితులు ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో, స్థానిక భూ బకాసురుల కన్ను ఈ విలువైన స్థలాలపై పడింది. ఈ ప్రాంతంలో హైరైజ్డ్ బిల్డింగులు నిర్మిస్తే కోట్లాది రూపాయల లాభం వస్తుందని లెక్కలు వేసుకున్న కొందరు కబ్జాదారులు, సామాన్యులను ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టారు.
ఈ భూముల్లో తాము అపార్ట్‌మెంట్లు నిర్మిస్తామని, యజమానులంతా తమ స్థలాలను అప్పగించాలని కబ్జాదారులు హుకుం జారీ చేస్తున్నారు. దీనికి ఒప్పుకోని పక్షంలో 'హైడ్రా'ను రంగంలోకి దింపుతామంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. "ఇవి ప్రభుత్వ భూములని, మీవన్నీ అక్రమ కట్టడాలని హైడ్రాకు ఫిర్యాదు చేస్తాం.. వారు వచ్చి ఇళ్లు కూల్చేసిన తర్వాత ఇక్కడ ప్రభుత్వ స్థలమని బోర్డులు పాతించి, మిమ్మల్ని రోడ్డున పడేస్తాం" అంటూ బహిరంగంగానే బెదిరింపులకు దిగుతున్నారు. ఒకవైపు న్యాయస్థానం తమకు అనుకూలంగా తీర్పు ఇచ్చినా, రాజకీయ అండదండలు ఉన్న బడా బాబులు ఇలా హైడ్రా పేరు చెప్పి భయపెడుతుండటంతో బాధితులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం గడుపుతున్నారు.
ప్రభుత్వం చెరువులను, ప్రభుత్వ ఆస్తులను రక్షించడానికి ఏర్పాటు చేసిన ఒక ప్రతిష్ఠాత్మక సంస్థను, ఇలా తమ స్వార్థం కోసం వాడుకుంటున్న భూ రాబందులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అంటే కేవలం కూల్చివేతలు మాత్రమే కాదని, అది సామాన్యులకు భరోసా ఇచ్చే సంస్థగా ఉండాలని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి గోపాల్ నగర్ బాధితులకు రక్షణ కల్పించాలని, హైడ్రా పేరును దుర్వినియోగం చేస్తున్న ముఠాలను అదుపు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే, సామాన్యుల భూములను కబ్జా చేసేందుకు 'హైడ్రా' ఒక సాకుగా మారిపోయే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# రాహుల్ తో కలిసి పొంగులేటి

### కేరళలో విజయానికి మంత్రి వ్యూహాలు

**హైదరాబాద్, మహా:** కేరళంలో ఈ సారి రాజకీయ మార్పు అనివార్యమని, ప్రజలు ప్రత్యామ్నాయం కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. యూడీఎఫ్ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి వస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. కేరళం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం అలెప్పి నియోజకవర్గం మన్నన్‌చెరీ పంచాయితీలోని కవ్వంకల్‌లో జరిగిన ఎన్నికల ప్రచారసభలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీతో కలిసి మంత్రి పొంగులేటి స్థానిక అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు అవకాశం ఇస్తే తెలంగాణలో అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ మోడల్‌ను అక్కడ కూడా అమలు చేస్తామని, తెలంగాణలో అమలు చేస్తున్నట్లే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కేరళంలో కూడా ప్రవేశపెడతామని మంత్రి పొంగులేటి ప్రకటించారు.



### న్యాయ కోవిదుడికి రాష్ట్ర ప్రభుత్వం


# ఘన స్వాగతం!

- నోవాటెల్‌లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అధికారిక విందు
- పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించిన సీఎం రేవంత్ రెడ్డి
- న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య అపూర్వ సంగమం

**శంషాబాద్, మహా:** భారత సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆయనకు ఘనంగా స్వాగతం పలికింది.దేశ అత్యున్నత న్యాయపీఠం అధిపతి హోదాలో నగరానికి విచ్చేసిన ఆయన గౌరవార్థం శంషాబాద్‌లోని హోటల్ నోవాటెల్‌లో శనివారం రాత్రి ప్రభుత్వం తరపున అధికారిక విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా హాజరై, జస్టిస్ సూర్యకాంత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రానికి విచ్చేసిన విశిష్ట అతిథికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా, తగిన గౌరవ మర్యాదలు కల్పించడంలో ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ముఖ్యమంత్రి, ప్రధాన న్యాయమూర్తి మధ్య జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీ అత్యంత ఆత్మీయ వాతావరణంలో సాగింది. ఈ విందు కార్యక్రమం న్యాయ మరియు కార్యనిర్వాహక వ్యవస్థల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని చాటిచెప్పేలా సాగింది. రాష్ట్రంలోని న్యాయ వ్యవస్థకు సంబంధించిన కీలక నేతలు కూడా ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్‌తో పాటు పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, రాష్ట్ర అడ్వకేట్ జనరల్ మరియు ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ విందులో పాల్గొని జస్టిస్ సూర్యకాంత్‌ను మర్యాదపూర్వకముగా కలుసుకున్నారు. దేశాభివృద్ధిలో న్యాయవ్యవస్థ పోషిస్తున్న పాత్రను, రాజ్యాంగ విలువలను కాపాడటంలో న్యాయమూర్తుల కృషిని ఈ సందర్భంగా నేతలు కొనియాడారు.

# రాష్ట్రంలో భూతగాదాలకు ఇక చెక్

## సంచలన నిర్ణయం తీసుకున్న తెలంగాణ సర్కార్
## సరికొత్త విధానానికి శ్రీకారం



(మొదటిపేజీ తరువాయి)

ప్రాసెస్ పూర్తవుతుంది. కానీ, క్షేత్రస్థాయిలో ఆ భూమి ఉందా? సరిహద్దులు సక్రమంగా ఉన్నాయా? అనేది రిజిస్ట్రేషన్ అధికారుల పరిధిలోకి రాదు.

**అధికారులకు సవాల్‌గా..**

దీని వలన ఒకే సర్వే నంబర్‌పై డబుల్ రిజిస్ట్రేషన్లు జరగడంతో వివాదాలు మొదలవుతున్నాయి. అంతేగాక ప్రభుత్వ, ప్రైవేటు భూముల మధ్య స్పష్టత లేకపోవడం, వాటిని గుర్తించేందుకు అధికారులకు సవాల్ గా మారుతున్నది. ఇరు పార్టీల మధ్య రిజిస్ట్రేషన్ల ప్రాసెస్ ముగిసిపోయిన తర్వాత వివాదాలు మొదలు అవుతున్నాయి. అధికారుల రికార్డుల ప్రకారం ప్రస్తుతం సుమారు 70 శాతం కంటే ఎక్కువ కేసులు భూ వివాదాలతోనే కోర్టుల్లో పెండింగ్ లో ఉన్నట్లు చెప్తున్నారు. దీంతోనే ఈ కొత్త విధానాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

**కొత్త విధానంతో ఇలా..?**

కొత్త విధానంలో సర్వే , రిజిస్ట్రేషన్ ప్రక్రియలు ఒక దానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి.ఎవరైనా భూమిని అమ్మాలనుకున్నప్పుడు, ముందుగా సర్వే కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఆ తర్వాత డిజిటల్ కో ఆర్డినేట్స్ ఆధ్వర్యంలో ఆధునిక టెక్నాలజీ ద్వారా భూమి అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తిస్తారు. నిర్దేశిత సర్వేయర్లు సర్వేను మానిటరింగ్ తోపాటు డిజిటల్ రికార్డ్స్ లో నమోదు చేస్తారు. ఆ తర్వాత సరిహద్దులు ఖరారైన వెంటనే ఆ వివరాలు ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో అప్‌డేట్ అవుతాయి. పోర్టల్‌లో సర్వే డేటా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన తర్వాతే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో క్రయవిక్రయాలు జరుగుతాయి. ఈ విధానంతో రిజిస్ట్రేషన్ శాఖలో గణనీయమైన మార్పులు కనిపించనున్నాయి. భూ వివాదాల కొత్త కేసులు 80 శాతం నుంచి 90 శాతం తగ్గే ఛాన్స్ ఉన్నది. డబుల్ రిజిస్ట్రేషన్లు 100 శాతం తగ్గుతాయి. కోర్టుల్లోని పెండింగ్ కేసులు కూడా క్రమంగా క్లియర్ అవుతాయని ఆఫీసర్లు తెలిపారు.

**టైటిల్ గ్యారంటీ**

భూ పరిపాలన నిపుణుల విశ్లేషణ ప్రకారం కేవలం కాగితాల మీద రిజిస్ట్రేషన్ కాకుండా, క్షేత్రస్థాయి కొలతలతో రిజిస్ట్రేషన్‌ను లింక్ చేయడం వల్ల 'టైటిల్ గ్యారెంటీ' లభిస్తుంది. దీని వల సామాన్య రైతులకు, రియల్ ఎస్టేట్ రంగానికి మరింత భరోసా లభిస్తుందని ఎక్స్ పర్ట్స్ వివరిస్తున్నారు. మరోక వైపు సర్వే చేసిన భూమికి ఆధార్ లాంటి యూనిక్ నంబరును కేటాయించడం వలన, భూమాఫియాకు అడ్డుకట్ట పడటమే కాకుండా, రాష్ట్ర ఖజానాకు కూడా పారదర్శకమైన ఆదాయం సమకూరుతుందని వివరించారు. భూ భారతి ద్వారా రాబోతున్న ఈ మార్పులు సామాన్యుల భూమికి రక్షణ కవచంగా నిలుస్తుందని అధికారులు చెప్తున్నారు.

# నియోజకవర్గాల పునర్విభజనపై ప్రధాని మోదీ సంచలన వ్యాఖ్యలు

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు ఏదో పెద్ద అన్యాయం జరిగిపోతుందన్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ వల్ల దక్షిణాది రాష్ట్రాలు తమ లోక్‌సభ సీట్లను కోల్పోతాయన్న వాదనలు కేవలం అపోహలు మాత్రమేనని, దేశ ప్రయోజనాలను, రాష్ట్రాల హక్కులను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని ప్రధాని ఉద్ఘాటించారు. జనాభా నియంత్రణలో అద్భుత ప్రదర్శన కనబరిచిన రాష్ట్రాలను శిక్షించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని, జనాభా ప్రాతిపదికన సీట్లు తగ్గుతాయన్నది పూర్తిగా అవాస్తవమని ఆయన కొట్టిపారేశారు.ఈ సుదీర్ఘ ప్రక్రియపై నెలకొన్న భయాందోళనలను తొలగించే క్రమంలో ప్రధాని మోదీ విశ్లేషణాత్మక వ్యాఖ్యలు చేశారు. దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాల పాత్ర వెలకట్టలేనిదని, అటువంటి రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించే సాహసం ఏ ప్రజాస్వామ్య ప్రభుత్వం చేయదని ఆయన పేర్కొన్నారు. జనాభా పెరగడం లేదా తగ్గడం అనే అంశాలను కేవలం అంకెలతో చూడకుండా, ఆయా రాష్ట్రాల సామాజిక, ఆర్థిక వృద్ధిని కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న దక్షిణాది రాష్ట్రాలు తమ జనాభాను క్రమబద్ధీకరించుకోవడాన్ని ఒక గొప్ప విజయంగా పరిగణించాలే తప్ప, దానిని రాజకీయ బలహీనతగా మార్చకూడదన్నదే కేంద్ర ప్రభుత్వ దృఢ నిశ్చయమని ఆయన వివరించారు. పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని, దీనిని కేవలం రాజకీయ కోణంలో చూడటం సరికాదని ప్రధాని సూచించారు. భవిష్యత్తులో పెరగబోయే పార్లమెంటు సీట్ల సంఖ్యను అన్ని రాష్ట్రాల ప్రయోజనాలకు అనుగుణంగానే నిర్ణయిస్తామని, ఏ ఒక్క ప్రాంతానికి విఘాతం కలగకుండా తగిన శాస్త్రీయ పద్ధతులను అవలంబిస్తామని భరోసా ఇచ్చారు. దక్షిణాది రాష్ట్రాల ప్రజలు తమ ప్రాతినిధ్యం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, దేశ సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసే విధంగా ఎలాంటి నిర్ణయాలు ఉండబోవని ఆయన స్పష్టం చేశారు. ఉత్తరాది, దక్షిణాది అనే విభజన రేఖలను సృష్టించేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నాయని, అటువంటి ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని కోరారు.లోక్‌సభ స్థానాల పెరుగుదల అనేది దేశవ్యాప్తంగా ఓటర్ల సౌలభ్యం కోసం, పరిపాలన వికేంద్రీకరణ కోసం ఉద్దేశించినదే తప్ప, ఒక ప్రాంతంపై మరొక ప్రాంతం ఆధిపత్యం చెలాయించడానికి కాదని ప్రధాని విశ్లేషించారు. దక్షిణాది రాష్ట్రాల్లో అమలవుతున్న వినూత్న పథకాలు, అక్కడి అక్షరాస్యత, ఆరోగ్య సూచీలు దేశానికే గర్వకారణమని కొనియాడారు. అటువంటి ప్రగతిశీల రాష్ట్రాల గొంతు పార్లమెంటులో తగ్గకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. ఈ విషయంలో అఖిలపక్ష సమావేశాల ద్వారా, అన్ని రాష్ట్రాల ఏకాభిప్రాయంతోనే ముందడుగు వేస్తామని, ప్రజాస్వామ్య విలువలకు కట్టుబడి పునర్విభజన ప్రక్రియ పారదర్శకంగా సాగుతుందని మోదీ తన ప్రసంగంలో ఆశాభావం వ్యక్తం చేశారు.డీలిమిటేషన్ ప్రక్రియ ద్వారా ప్రతి ఓటరుకు సమానమైన విలువ ఉండాలనేది ప్రాథమిక సూత్రం అయినప్పటికీ, జనాభా నియంత్రణ పాటించిన రాష్ట్రాల రాజకీయ ప్రాముఖ్యత తగ్గకుండా ఉండేలా ప్రత్యేక ఫార్ములాలను రూపొందించడంపై కసరత్తు జరుగుతోందని ప్రధాని సూచనప్రాయంగా తెలిపారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుందన్న పాత పద్ధతులకు భిన్నంగా, సమతుల్యతను కాపాడే మార్గాలను అన్వేషిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తానికి, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై దక్షిణాది రాష్ట్రాల్లో చెలరేగుతున్న రాజకీయ దుమారానికి ప్రధాని మోదీ తన వివరణతో తెరదించే ప్రయత్నం చేశారు.ఈ కీలకమైన రాజ్యాంగ ప్రక్రియపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, రాజకీయ లబ్ధి కోసం తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడం దేశ సమగ్రతకు మంచిది కాదని ప్రధాని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటంలో తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని, "సబ్ కా సాత్ సబ్ కా వికాస్" మంత్రంతోనే దేశంలోని అన్ని ప్రాంతాలకు సమన్యాయం జరుగుతుందని ఆయన పునరుద్ఘాటించారు. నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రం తీసుకునే తదుపరి చర్యలు ఏ విధంగా ఉంటాయో అన్న ఉత్కంఠకు ప్రధాని తాజా వ్యాఖ్యలు కొంత ఉపశమనాన్ని కలిగించాయి. దక్షిణాది రాజకీయ నేతలు, మేధావులు వ్యక్తం చేస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని, సమగ్రమైన విశ్లేషణతో ముందుకు సాగుతామన్న ప్రధాని హామీ భవిష్యత్తులో ఈ అంశంపై మరింత నిర్మాణాత్మక చర్చకు దారితీస్తుందని భావిస్తున్నారు.

## మరోసారి ఔదార్యం చాటుకున్న తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు

- సరోజిని వృద్ధాశ్రమానికి భారీ వితరణ
- ఆశ్రమానికి రూ.5 లక్షల వ్యయంతో 10 కేవీ సోలార్ విద్యుత్తు ఏర్పాటు



**భద్రాచలం మహా :** బూర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు మరోసారి ఔదార్యం చాటుకుంది. భద్రాచలంలోని సరోజిని వృద్ధాశ్రమానికి రూ.5 లక్షల వ్యయంతో 10 కెవి విద్యుత్తు సౌకర్యాన్ని ఏర్పాటు చేసింది. తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతం తోలనే ఆశ్రమం భవనం నిర్మించడంతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. తాజాగా సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేసి తమ మంచి మనసును చాటుకున్నారు. ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య మనవడు ప్రవాస భారతీయులు తానా మాజీ అధ్యక్షుడు తాళ్లూరి జయశేఖర్ నీలిమ దంపతుల కుమారుడు సాయిపంచాక్షర్ తన మొదటి నెల వేతనం నుంచి రూ.5 లక్షల వ్యయంతో 10 కే వి సోలార్ విద్యుత్తును ఏర్పాటు చేయించారు. సాయిపంచాక్షర్ చిన్నతనం నుంచే సమాజసేవపై తనకు ఉన్న మక్కువను చాటుకున్నారు. తమ సొంతగడ్డ మీద అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతను అందిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్తును శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఆశ్రమానికి భారీ వితరణ అందించిన ట్రస్టు బాధ్యులకు ఆశ్రమం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, తానా మాజీ అధ్యక్షులు తాళ్లూరి జయశేఖర్ నీలిమ దంపతులు, తాళ్లూరి ట్రస్టు డైరెక్టర్ వల్లూరిపల్లి వంశీకృష్ణ, బూర్గంపాడు పీఏసీఎస్ మాజీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, భద్రాచలం సర్పంచి పూనెం కృష్ణ, అడుసుమిల్లి జగదీశ్, పల్లంటి దేశప్ప, మోతుకూరి వీరయ్య, బొడ్డపాటి రామారావు, చావా లక్ష్మీనారాయణ, జలగం చంద్రశేఖర్, ఆశ్రమం నిర్వాహకులు సరోజిని తదితరులు పాల్గొన్నారు.

## కేరళలో ఎన్నికల ప్రచారంలో.. దూసుకుపోతున్న బ్రహ్మయ్య



**మణుగూరు, మహా :** తెలంగాణ ఎన్నికల్లో తన వ్యూహాలతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాల్లో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో చురుకుగా పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు క్షేత్రస్థాయిలో ప్రచార వ్యూహాలను అమలు చేస్తూ నాయకులకు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేస్తున్నారు. రాష్ట్రంలో పోటీ తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రతి ఓటును కీలకంగా మార్చేలా వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో శనివారం కేరళలోని పతనంతిట్ట జిల్లా అరన్మూల నియోజకవర్గం పుల్లాడ్ స్ట్రీట్ కార్నర్ సమావేశంలో బ్రహ్మయ్య పాల్గొన్నారు. ఈ సమావేశానికి కర్ణాటక ఎనర్జీ మంత్రి కెజె జార్జ్, ఏఐసీసీ కార్యదర్శి జరితతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఎన్నికల సమరంలో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన కార్యాచరణపై బ్రహ్మయ్య కీలక సూచనలు చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.

## మొరంపల్లి బంజార గ్రామంలో విషాదం

### నివాళులు అర్పించిన మాజీ జడ్పీటీసీ దంపతులు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజార గ్రామపంచాయతీకి చెందిన బొజ్జ హేమంత్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ దుర్ఘటన విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి దంపతుల మాజీ జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత రామకొండారెడ్డి దంపతులు హేమంత్ నివాసానికి వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు.

**ఆర్థిక సహాయం అందజేత**

మృతుడి కుటుంబానికి తోడ్పాటుగా దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సహాయం ద్వారా కుటుంబానికి కొంత ఉపశమనం కలిగించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు కైపు కగేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ పొక్కుల రవి, మేడం లక్ష్మీ నారాయణ రెడ్డి, మూల బాలి రెడ్డి, కోరుకుంట్ల చిన్నప్ప రెడ్డి, చేతుల పెద్ద వీర్రాజు, గంగుల చంద్రశేఖ రెడ్డి, శనగ అప్పారావు తదితర గ్రామ పెద్దలు, బంధుమిత్రులు పాల్గొని హేమంత్‌కు నివాళులు అర్పించారు.

## రైల్వేలైన్ భూసేకరణపై కలెక్టరేట్‌లో సమావేశం

- ఎకరానికి రూ.19 లక్షలు, గజానికి రూ. 6300 ఇస్తామన్న అధికారులు
- 10 శాతం అయినా పెంచాలని ప్రాధేయపడ్డ నిర్వాసితులు
- జేసీ, ఎస్డీఎల్ సీ తో ఫోన్ లో మాట్లాడిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్
- మరో సమావేశంలో రేటు ఫైనల్ చేద్దామని అధికారులతో చెప్పిన ఎమ్మెల్యే




**కారేపల్లి, మహా:** డోర్నకల్ భద్రాచలం రోడ్ రైల్వే లైన్ డబ్లింగ్ పనుల కోసం భూసేకరణ చేసిన భూములకు రేటు విషయంలో చర్చించేందుకు ఖమ్మం జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి సింగరేణి గ్రామానికి చెందిన భూ నిర్వాసితులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఖమ్మం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ నిర్ణయించిన రేటును స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రకటించారు. వ్యవసాయ భూమికి ఎకరానికి 19 లక్షల రూపాయలు, ఇళ్ల స్థలాలకు గజానికి రూ. 6300 చెల్లిస్తామని స్పష్టం చేశారు. ఏజెన్సీ ప్రాంతాల భూసేకరణలో చెల్లించిన రేట్లనే చెల్లిస్తామని అధికారులు పేర్కొనడంతో దానికి నిర్వాసితులు అంగీకరించలేదు. నాన్ ఏజెన్సీ విషయంలో అక్కడి భూముల ధరలను కూడా పరిగణలోకి తీసుకొని మానవతా దృక్పథంతో న్యాయం చేయాలని బాధితులు కోరారు. 10 శాతం అయినా పెంచాలని భూ నిర్వాసితులు ప్రాధేయపడ్డారు. రెండోసారి ఏర్పాటు చేసిన సమావేశం లో కూడా పరిహారం పెంచడంలో అధికారులు నిర్ణయం తీసుకోకపోవడం తో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సమక్షంలో మరోసారి సమావేశం ఏర్పాటు చేయడానికి అవకాశం కల్పించమని నిర్వాసితులు కోరారు. వారం రోజుల లోపలనే మరోసారి ఏర్పాటు చేసే సమావేశం నాటికి ఆలోచించుకొని నిర్ణయం తెలపాలని అధికారులు పేర్కొన్నారు.

**అధికారులతో ఫోన్లో మాట్లాడిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్...**

కలెక్టరేట్ లో శనివారం నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశానికి వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సిద్ధమయ్యారు. కానీ అత్యవసర పనుల వల్ల కలెక్టర్, జేసీ సమావేశానికి రావడం లేదని తెలపడంతో ఎమ్మెల్యే ఫోన్లో జేసీ శ్రీనివాస్ రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజేశ్వరి తో మాట్లాడారు. రైతులు, ఇళ్ళు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. మరో సమావేశానికి తాను తప్పనిసరిగా హాజరవుతానని అధికారులు, భూ నిర్వాసితులతో చర్చించి ఆ సమావేశంలో రేటు ఫైనల్ చేద్దామని ఎమ్మెల్యే తెలిపారు.



## చర్లలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కలకలం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో అనుమానాస్పద పరిస్థితుల్లో ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించడం స్థానికంగా కలకలం రేపింది. చర్ల మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని జయంతి కాలనీ శివారు ప్రాంతంలోని తత్రవాగు వద్ద ఈ ఘటన వెలుగులోకి వచ్చింది.

**తాలిపేరు ప్రాజెక్టు దారిలో శవం గుర్తింపు**

తాలిపేరు ప్రాజెక్టుకు వెళ్లే దారి పక్కన మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలనలు చేపట్టారు. సామానుతో పాటు మైకా సంచిమృతదేహం పక్కనే అతనికి చెందినట్లు అనుమానిస్తున్న సామాను, ఒక మైకా సంచి కూడా లభించింది. దీని ఆధారంగా పోలీసులు అతని వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు.

**ఛత్తీస్‌గఢ్‌కు చెందినవాడిగా అనుమానం**

ప్రాథమిక సమాచారం ప్రకారం మృతుడు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వ్యక్తి అయి ఉండొచ్చని అనుమానిస్తున్నారు. అయితే అసలు గుర్తింపు, మరణానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందిఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతుడి వివరాలు, ఘటనకు గల కారణాలు త్వరలో వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## అరుణోదయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఈనెల 10, 11వ తేదీలలో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుండి జరిగే అరుణోదయ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కొత్తగూడెం కోర్టు దగ్గర అరుణోదయ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం పౌర హక్కుల సంఘం(సీ ఎల్ సి)జిల్లా అధ్యక్షుడు ఎస్ ఉపేందర్ రావు, అరుణోదయ జిల్లా కార్యదర్శి ఎనగంటి చిరంజీవి మాట్లాడుతూ నాటి తెలంగాణ సాయుధ పోరాట నుండి నేటి తెలంగాణ ఉద్యమం వరకు కళాకారులే ప్రధాన పాత్ర పోషించారని కళా రంగమే కొన్ని విజయాలను సాధించి పెట్టిందని అన్నారు. ఏ రంగమైనా కళా రంగం లేకుండా ముందుకు పోదని అభివృద్ధి జరగదని వారు పేర్కొన్నారు. ఏ సమస్యనైనా కండ్లకు కట్టినట్టుగా చూపించగలిగేది అర్థం వివరించగలిగేది ఒక కళా రంగం మాత్రమేనని అన్నారు. ప్రపంచ ఉద్యమాలలోనే కళారంగానికి ఒక ప్రాధాన్యత నెలకొని ఉందని అలాంటి కళారంగానికి వెన్నుదన్నుగా నిలవాల్సిన అవసరం ప్రజలకు ప్రజాస్వామిక వాదులకు మేధావులకు ఉందని అన్నారు. జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ తో అవతరించిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కానూరి వెంకటేశ్వరరావు మొదటి అధ్యక్షుడిగా మొదలుకొని నేటి వరకు అనేక ఉద్యమాలలో పాల్గొంటుందని వారు అన్నారు. నేడు పాలకుల కుట్రల వలన కళా రంగం వెనుకబడిపోయిందని పాలకులు దానిని గుప్పిట్లో పెట్టుకొని బానిసలుగా మార్చడం కోసం తయారు చేసిందని ఇలాంటి వాటిని చేదిస్తూ నూతన ప్రజాస్వామ్య విప్లవంలో తమ వంతు పాత్రకై కళా రంగం అభివృద్ధి కావాలని ఆ క్రమంలోనే హైదరాబాదులో జరిగే రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ న్యాయవాదులు సాదిక్ పాషా అనుదీప్ తో పాటు అరుణోదయ జిల్లా నాయకులు ఎనగంటి లాజర్, వీరమల్ల సురేష్, జీవన్, సాగర్, డమరుకేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి జిల్లా పర్యటన



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక బిఆర్ఎస్ నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకుని పార్టీ కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు.

**స్థానిక నాయకులతో సమావేశం**

ఈ పర్యటనలో భాగంగా కే.వి. రమణ సహా పలువురు నాయకులు రాకేష్ రెడ్డిని కలుసుకున్నారు. జిల్లా రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై అభిప్రాయాలు పంచుకున్నారు.

**గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై చర్చ**

రాబోయే 2026 డిసెంబర్ నెలలో జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని విస్తృతంగా చర్చ జరిగింది. యువ గ్రాడ్యుయేట్లను ఓటర్లుగా నమోదు చేయించడం, పార్టీ బలాన్ని పెంచడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు.

**పార్టీ బలోపేతానికి కృషి**

ఈ సందర్భంగా రాకేష్ రెడ్డి మాట్లాడుతూ, స్థానిక స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను ఆకర్షించి, ఎన్నికల్లో విజయం సాధించేందుకు కట్టుదిట్టమైన కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాడిద దామోదర్, చీకటి ప్రసాద్, సిద్దిల రవికుమార్, కాకి ప్రసాద్ తదితరులు పాల్గొని రాకేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




## గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా...

### భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఇమంది నాగేశ్వరరావు

**భద్రాచలం మహా:** గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా, ఇది కేవలం ఒక కార్యాలయంపై జరిగిన దాడి కాదు — తెలంగాణ ప్రజాస్వామ్యంపై జరిగిన దాడి. పట్టపగలు, అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఘటన రాష్ట్రంలో చట్టవ్యవస్థ పరిస్థితిపై తీవ్ర సందేహాలు రేకెత్తిస్తోంది. శాంతిభద్రతలు ఉన్నాయా? లేక రాజకీయ అరాచకాలకు మార్గం సుగమం అవుతోందా?ఒకవైపు "హేట్ స్పీచ్" పేరుతో గొంతు నొక్కడం, మరోవైపు గూండాలతో దాడులు చేయించడం — ఇదేనా ప్రజా భద్రాచలం మహా*పాలన? "ప్రజాస్వామ్య పునరుద్ధరణ" అంటూ హామీలు ఇచ్చిన వారు, నేడు ప్రతిపక్షంపై దాడులు జరుగుతున్నప్పటికీ మౌనం వహించడం బాధాకరం. ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం అని తీవ్రంగా ఖండించిన భద్రాచలం బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఇమంది నాగేశ్వరరావు.

## పేదల ఆకలి తీరుస్తున్న లయన్స్ క్లబ్

### 100 రోజులు పూర్తి చేసిన సేవా కార్యక్రమం

**భద్రాచలం మహా :** భద్రాచలం పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఫ్రీ మీల్స్ ఆన్ వీల్స్" కార్యక్రమం విజయవంతంగా 100 రోజులకు చేరుకుంది. పేదలు, నిరుపేదలు, అనాథలు ఆకలితో బాధపడకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిరోజూ అవసరమైన వారికి ఉచితంగా ఆహారం పంపిణీ చేస్తున్నారు. ముఖ్యంగా రోడ్లపై జీవించే వారు, వృద్ధులు, ఆర్థికంగా బలహీన వర్గాలకు ఈ సేవ ఎంతో ఉపయోగకరంగా మారింది. వాహనాల ద్వారా నేరుగా వారి వద్దకే వెళ్లి భోజనం అందించడం ఈ కార్యక్రమం ప్రత్యేకత. లయన్స్ క్లబ్ సభ్యులు సేవాభావంతో నిరంతరం పాల్గొంటూ, సమాజంలో మానవతా విలువలను చాటుతున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు, దాతలు కూడా మద్దతు తెలుపుతూ సహకరిస్తున్నారు. 100 రోజులు పూర్తిచేసుకున్న సందర్భంగా క్లబ్ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో కూడా ఈ సేవలను మరింత విస్తరించాలని సంకల్పించారు. వారి సేవలను స్థానిక ప్రజలు ప్రశంసిస్తూ అభినందిస్తున్నారు.



## కాంట్రాక్టు కార్మికుల రిలే నిరాహార దీక్ష

### 10వ రోజుకు చేరిక

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలంలోని ఐటీసీ పేస్పిడి యూనిట్ లో కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష 10వ రోజుకు చేరుకుంది. తమ హక్కులు, న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు దీక్ష కొనసాగిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన కాంగ్రెస్ నాయకులుఈ సందర్భంగా బూర్గంపహాడ్ మాజీ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పూలపెల్లి సుధాకర్ రెడ్డి, ఐ ఎన్ టి యు సి రాష్ట్ర నాయకుడు మారం వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు భర్మావత్ రాంబాబు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

**కార్మికుల సమస్యలపై స్పందన**

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చేస్తున్న పనికి తగిన వేతనం ఇవ్వాలని, కంపెనీ ఐడీ కార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు.

**న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి పిలుపు**

కార్మికుల న్యాయమైన డిమాండ్లను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్మికుల సంక్షేమం కోసం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**కాంగ్రెస్ పార్టీ అండ**

కాంట్రాక్టు కార్మికుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు. కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని స్పష్టం చేశారు.

## అందరి ఆరోగ్యం కోసం ప్రపంచ పర్యావరణ సంస్థ కృషి అభినందనీయం

**సేవకు శ్రీ సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి సహకారం మరువలేనిది.. భద్రాచలం ఎంఈఓ టి.రమ**




**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** అందరి ఆరోగ్యం కోసం "ప్రపంచ పర్యావరణ సంస్థ" కృషి అభినందనీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భద్రాచలం ఎంఈఓ టి.రమ అన్నారు. ప్రపంచ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో శ్రీ సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి సహకారంతో శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో, పాల్వంచ పట్టణ బాలికల గురుకుల పాఠశాలలో, అన్నపురెడ్డిపల్లి ప్రాంతంలో బాలికల ఆరోగ్యం సామాజిక బాధ్యత అన్న అంశం అవగాహన సదస్సు ను ఏర్పాటు చేశారు. ఈ సదస్సు సిహెచ్ కళాసాగర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు భద్రాచలం ఎంఈఓ టి.రమ మాట్లాడుతూ భారతదేశంలో ఆడబిడ్డల నెలసరి కార్యక్రమం గురించి సరైన అవగాహన లేకపోవడం మూలంగా భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సైతం ప్రతి పాఠశాలలో ప్రతి కళాశాలలో టీనేజ్లోకి అడుగుపెట్టిన ప్రతి ఆడబిడ్డకు ప్రతి నెల నెలసరి కార్యక్రమానికి అవసరమైన మంత్లీ శానిటేషన్ ప్యాడ్స్ ను ఉచితంగా ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిన కూడా ఈరోజు వరకు అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. ఆడబిడ్డలకు అనేక రకాల అపోహలు మూలంగా అనేక రకాల మానసిక శారీరక సమస్యలు కొని తెచ్చుకుంటున్నారని ఈ కీలక సమయంలో ప్రపంచ పర్యావరణ సంస్థ జాతీయ కార్యవర్గం ఆధ్వర్యంలో తమ పాఠశాలలో శ్రీ సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి సహకారంతో వేల మంది ఆడబిడ్డలకు ఉచితంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా వివిధ గిరిజన గూడాలల్లో సానిటేషన్ ప్యాడ్స్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. సానిటేషన్ యాడ్స్ పంపిణీ కార్యక్రమాన్ని తమ పాఠశాలలో ప్రారంభించి విద్యార్థినిలకు ఆరోగ్యం పట్ల సంపూర్ణ అవగాహన కల్పించి ఆడపిల్లల్ని చదివించి ఆడపిల్లల్ని ఎదగనించడానికి ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. ప్రతి ఒక్కరు కూడా సేవను గుర్తించి ఆ సంస్థలో ప్రతి ఒక్కరూ పాల్గొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సభాధ్యక్షురాలు కళాసాగర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ సంస్థ బడినీ గుడినీ కేంద్రంగా చేసుకొని గత 14 సంవత్సరాలుగా దేశంలో అనేక రాష్ట్రాలలో దాదాపుగా 10000 మంది ఉపాధ్యాయులకు పర్యావరణ పరిరక్షణ దైవ సేవ దేశ సేవగా వారికి శిక్షణ ఇప్పించడం జరిగిందన్నారు. అందులో భాగంగా భారత సుప్రీంకోర్టు పిలుపుమేరకు 13 సంవత్సరాలు దాటిన ప్రతి ఆడబిడ్డ ముఖ్యంగా విద్యార్థిని విద్యార్థులు గ్రామీణ ప్రాంతాలలో ఆదివాసి గిరిజన గూడాలలో సరైన అవగాహన లేక కనీసం నెలసరి కార్యక్రమాల మీద ఎన్నో అపోహల మూలంగా అనేక రకాల కష్టాలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరికి ఆరోగ్యకరమైన జీవితాన్ని జీవించే విధంగా ప్రపంచ పర్యావరణ సంస్థ పనిచేస్తుందని అందుకోసం ఈరోజు దాదాపు 20,000 మంది బిడ్డల కోసం ఈ కార్యక్రమాన్ని ఇక్కడ మనం ప్రారంభించడం జరిగిందని వివరించారు. అందుకు అందరు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ సార్వి సంస్థ నిర్వాహకురాలు స్రవంతి మాట్లాడుతూ ఒక ఆడబిడ్డగా ఆడబిడ్డను కన్న తల్లిగా నా జీవితంలో ఎదుర్కొన్న సమస్యల నుంచి తాను ఈరోజు ఈ సంస్థను స్థాపించి ప్రతి ఇంట్లో ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో ఆనందంగా ఆరోగ్యకరంగా జీవించడానికి ప్రపంచ పర్యావరణ సంస్థ చేస్తున్న కృషికి తన వంతు బాధ్యతగా ఇందులో పాల్గొని వీరితో కలిసి రాబోవు రోజులలో మరిన్ని సేవ కార్యక్రమాలు నిర్వహిస్తానని తెలిపారు. ముఖ్యంగా ఏజెన్సీ ఏరియాలలో ఆదివాసి గూడాలలో తండాలలో మహిళలకు సరైన అవగాహన లేకపోవడం మూలంగా నెలసరి కార్యక్రమాలు పరిశుభ్రమైనటువంటి బయో డీగ్రేడబుల్ తయారైన శానిటేషన్ నాప్కిన్స్ ను ఇవ్వాలని ఈరోజు సంస్థను స్థాపించారని అందుకు మీ అందరి తోడ్పాటు అందించి దేశంలో ఉన్న మహిళలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆరోగ్య దేశం నిర్మాణం అవుతుందని తాను నమ్ముతున్నానని పేర్కొన్నారు. అందుకు అందరు సహకరించాలని పిలుపునిచ్చారు. సంస్థ ఉపాధ్యక్షురాలు సీనియర్ జర్నలిస్టు జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత శిల్పిక మాట్లాడుతూ నేడు దేశంలో మహిళల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. ఆరోగ్య విషయంలో మహిళలు సరైన అవగాహన లేకపోవడం మూలంగా క్యాన్సర్ బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో నిమిషానికి ఒక ఆడబిడ్డ క్యాన్సర్ భూతానికి గురవుతున్నారని తెలిపారు.

## మల్లాపూర్‌లో రన్ ఫర్ జీసస్



**కుషాయిగూడ, మహా :** నాచారం సర్కిల్ 22వ డివిజన్ మల్లాపూర్‌లో శనివారం ఉదయం నిర్వహించిన "రన్ ఫర్ జీసస్" కార్యక్రమాన్ని నెమలి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఆయన సమక్షంలో భక్తి,, ఉత్సాహ వాతావరణంలో కార్యక్రమం సాగింది. పాస్టర్లు టి మోతి, శాంతా రాజు, కోఆర్డినేటర్ సద్గుణ పాల్గొన్నారు. వందలాది క్రైస్తవ సోదర సోదరీమణులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో ప్రేమ, శాంతి, సహనాన్ని పెంపొందించే ఆధ్యాత్మిక కార్యక్రమాలు అవసరమన్నారు. "రన్ ఫర్ జీసస్" వంటి కార్యక్రమాలు సానుకూల సందేశాన్ని అందిస్తాయని తెలిపారు. నిర్వాహకులను అభినందించారు.

## చర్లపల్లిలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

- జీ ప్లస్ టూ అనుమతులతో అదనపు అంతస్తులు
- జీహెచ్ఎంసి చర్యలు, కేసు నమోదు



**కుషాయిగూడ, మహా :** మేడ్చల్ జిల్లా కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లిలో అక్రమ నిర్మాణాలపై జిహెచ్ఎంసి అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. పోలీసు బందోబస్తు మధ్య జెసిబిల సహాయంతో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలను కూల్చివేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టిన నిర్మాణదారునికి గతంలో మూడు సార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ, పట్టించుకోకుండా పనులు కొనసాగించినట్లు అధికారులు తెలిపారు. దీంతో ముందుగా భవనాన్ని సీజ్ చేసినప్పటికీ, మళ్లీ నిర్మాణాలు చేపట్టడంతో అధికారులు కఠినంగా స్పందించారు. టౌన్ ప్లానింగ్ ఏసిపి కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం, జీ ప్లస్ టూ అనుమతులు తీసుకుని అదనపు అంతస్తులు నిర్మించడంపై ఫిర్యాదులు రావడంతో భవనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. అయినప్పటికీ సీజ్ చేసిన భవనంలో మళ్లీ నిర్మాణాలు కొనసాగించడంతో నిర్మాణదారునిపై చర్లపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగిస్తూ అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని అధికారులు హెచ్చరించారు.




TIME: 4.30 PM, DATE: APRIL 11,
PLACE: HOTEL KATRIYA, HYDERABAD
CONTACT NO : 9666294446

# క్షేత్రస్థాయిలో పర్యటనలు పెంచి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆళ్లపల్లి మండలంలో శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృత స్థాయి క్షేత్ర పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, విద్యాసంస్థలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వ్యవసాయ క్షేత్రాలు తదితరాలను సమగ్రంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటనలు పెంచి ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ఆలస్యం చేయకుండా పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని తెలిపారు. భూభారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి వాటిపై సమగ్ర నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. మొదటగా అనంతోగు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ గ్రామంలో మంజూరైన 19 ఇళ్లలో ప్రస్తుతం 3 ఇళ్లు రూఫ్ స్థాయికి చేరుకున్నట్లు అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. లబ్ధిదారు గలిగ నాగలక్ష్మి ఇంటి నిర్మాణాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి పనుల నాణ్యత వినియోగిస్తున్న సామాగ్రి ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలను కూడా నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా ప్రతి అర్హ కుటుంబానికి నాణ్యమైన గృహాన్ని అందించాలన్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఆళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాస స్థాయిని తెలుసుకుని బయాలజీ వంటి విషయాల్లో డయాగ్రామ్స్ ప్రాక్టీస్ చేయాలని సూచించారు. పాఠశాల కిచెన్ స్టోర్ రూమ్‌లను తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన పరిశుభ్రమైన ఆహారం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. విద్యుత్ సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిసిన నేపథ్యంలో ఇన్వర్టర్ ఏర్పాటు ద్వారా సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసీల్దార్ జగదీష్వర్ ప్రసాద్, ఎంపీడీఓ శ్రీను, మండల ప్రత్యేక అధికారి లాల్ చంద్, ప్రధానోపాధ్యాయురాలు సరోజినీ, హెల్త్ ఎడ్యుకేటర్ రమాదేవి, వివిధ శాఖల అధికారులు సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# అసంక్రమిత వ్యాధుల గుర్తింపుకు ప్రత్యేక శిబిరాలు..



**మణుగూరు, మహా :** ప్రజల్లో పెరుగుతున్న అసంక్రమిత వ్యాధులను ముందుగానే గుర్తించి నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని వైద్యులు పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు పరిధిలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆమ్ సెంటర్ల పరిధిలో గ్రామాల వారీగా 30 సంవత్సరాల పైబడిన వారందరికీ బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సునీల్ తెలిపారు. విఠల్ రావు నగర్, రాజుపేట గ్రామాల్లో నిర్వహించిన ఆరోగ్య శిబిరాలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, వైద్య పరీక్షల్లో వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ఉచితంగా మందులు అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమం నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. అదేవిధంగా టిబి ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టిబి వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, నివారణ చర్యలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాంప్రసాద్, కృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు లక్ష్మీ, మనీషా తదితరులు పాల్గొన్నారు.

# రుణాల కొరకు దరఖాస్తు గడువు పెంపు

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన అభ్యర్థులకు రుణాల మంజూరు కొరకు దరఖాస్తు గడువు ఈనెల 8వ తేదీ వరకు పొడిగించినట్లు బూర్గంపహాడ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025 26వ సంవత్సరానికి బ్యాంకు అనుసంధానంతో కలిపి ఈవి ద్విచక్ర వాహనాలు, ద్విచక్ర గూడ్స్ ప్యాసింజర్ వాహనాలు, పశుసంవర్ధక రంగాలలో పాడి పశువులు, సోలార్ పంప్ సెట్ వంటి పథకాలకు అవకాశం కల్పించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు టి జి ఓ బి ఎం ఎం ఎస్ ఆన్లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు ను డౌన్లోడ్ చేసుకొని హార్డ్ కాపీని సంబంధిత పత్రాల ను జతపరిచి గ్రామీణ ప్రాంతాల వారు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఇవ్వాలని పేర్కొన్నారు.



# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు మైత్రి వెంకటరెడ్డికి ఘన సన్మానం

**పినపాక,మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులుగాఎన్నికైన శ్రీ సానికొమ్ము వెంకటరెడ్డి(మైత్రి ) ని పినపాక మండల ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పినపాక మండల అధ్యక్షులు బండారి వెంకట రాంబాబు మాట్లాడుతూ పినపాక మండలం నుండి జిల్లా ఉపాధ్యక్షులుగా సానికొమ్ము వెంకటరెడ్డి (మైత్రి ) గారు ఎన్నిక కావడం అందరికీ గర్వకారణం అన్నారు. నూతన ఉపాధ్యక్షులైన వెంకట్ రెడ్డి గారిని పినపాక అసోసియేషన్ తరపున ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండారి వెంకట రాంబాబు, నరేష్, రమేష్, ప్రసాద్, రవి, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

- సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం
- చీమలపాడులో అమరజీవి రాచర్ల రామయ్య వర్ధంతి



**కారేపల్లి, మహా :** సింగరేణి మండలం పూర్తి వర్షాధారం, బోర్లపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారని దీంతో సాగునీరు అందక పంటలు పండని పరిస్థితి ఉందని సీపీఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. శనివారం కారేపల్లి మండలం చీమలపాడులో సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి రాచర్ల రామయ్య 30 వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కమిటీ సభ్యులు అజ్మీర్ శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన సభలో భూక్యా వీరభద్రం మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80ఏండ్లు దాటిన ఏజెన్సీ ప్రాంతాలకు అభివృద్ధి అందని ద్రాక్షగానే ఉందన్నారు. సింగరేణి, కామేపల్లి మండలాల సాగునీటి సమస్యకు సీతారామ ప్రాజెక్టు నీళ్లతోనే పరిష్కారం అవుతుందన్నారు. ఖమ్మం జిల్లా ముగ్గురు మంత్రులు, కీలక శాఖలు నిర్వహిస్తున్నా ఏజెన్సీ మండలాలకు నీరు అందించడంలో విఫలమయ్యారని, సొంత నియోజకవర్గ□లకు నిధులు కేటాయించడం, నీళ్లు తీసుకెళ్లడం వంటి పక్షపాత వైఖరిని అవలంబిస్తున్నార ని విమర్శించారు. ఏజన్సీ మండలాలకు గిరిజన శాసనసభ్యులు ఉండి సాగు నీరు అందించకపోవడం వారి లొంగుబాటుకు, స్వార్థ ప్రయోజనాలకు తార్కానమన్నారు. చీమలపాడు ప్రాంతంలో కాలువల నిర్మాణానికి భూములు పోగొట్టుకున్న రైతులకు 2013 నిర్వాసితుల చట్టాన్ని సంపూర్ణంగా అమలు చేయకుండా అన్యాయం చేస్తున్నారరు. పత్తి మిర్చి పంటలు దెబ్బతిని ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న పంట వేశారని పంట కొనుగోలుకు ఎక్కువ కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికకు పేదల నుండి డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఇది సహించరానిదన్నారు. అర్హులైన వారందరికీ ఇండ్లు ఇవ్వకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. చీమలపాడు ప్రాంతంలో రాచర్ల రామయ్య వంటి అమరులు పేదలకోసం నిరంతరం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. వారి స్ఫూర్తితో పేదపక్షం వహించి పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. అంతకు ముందు రాచర్ల రామయ్య స్థూపం వద్ద జెండాను భూక్య వీరభద్రం ఎగర వేశారు. ఈ వర్ధంతి సభలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే నరేంద్ర, మండల కమిటీ సభ్యులు యనమనగండ్ల రవిబాబు, వల్లబోయిన కొండలరావు, సీనియర్ నాయకులు ఎర్రిపోతు భద్రయ్య, మన్నెం బ్రహ్మయ్య, రాచబంటి పుల్లయ్య, పోతురాజు చందర్రావు, శాఖ కార్యదర్శులు సురభాక సర్వయ్య, బానోత్ కిషన్, భానోత్ మంగీలాల్, రాచర్ల రణధీర్, షేరు వెంకటేశ్వర్లు, లలితమ్మ, మచ్చర్ల రమేష్, గోకినపల్లి భారత లక్ష్మీ, రాచర్ల నాగమణి, రాచర్ల జాలమ్మ, రాచర్ల రాంబాబు, సురభి ఉపేందర్, మాలోత్ హనుమ, భూక్య శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిలో సహజ మరణానికి కూడా 10 లక్షల ఉచిత బీమా పథకం అమలు

- యాజమాన్యం చొరవతో యూనియన్ బ్యాంక్ నిర్ణయం
- ఈ నెల 1వ తేదీ నుండి అమలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** ఇప్పటివరకు సింగరేణిలో కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని అమలు చేస్తున్న యూనియన్ బ్యాంక్ సింగరేణి యాజమాన్యం చేసిన సూచనల మేరకు సహజ మరణం చెందిన కార్మికులకు కూడా ఉచిత బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. యూనియన్ బ్యాంకులో కార్పొరేట్ శాలరీ అకౌంటు కలిగి ఉన్న కార్మికులు లేదా అధికారులు ఎవరైనా సరే మృతి చెందినట్లయితే వారికి పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని వర్తింప జేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు సింగరేణి సంస్థకు బ్యాంకు యాజమాన్యం తెలియజేసింది. సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి ఆదేశాల మేరకు డైరెక్టర్ పర్సనల్ ఫైనాన్సు గౌతమ్ పోట్రు ప్రత్యేక చొరవ ఫలితంగా యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఇది అమలులోకి రానున్నట్లు బ్యాంకు యాజమాన్యం పేర్కొంది. 2024లో రాష్ట్ర ప్రభుత్వం చొరవతో సింగరేణి కార్మికులకు ఉచిత కోటి రూపాయల ప్రమాద బీమా పథకాన్ని యూనియన్ బ్యాంకు అమలు జరిపింది. ఈ ఒప్పందానికి కొనసాగింపుగా సహజ మరణానికి కూడా 10 లక్షల రూపాయల ప్రమాద బీమాను వర్తింపజేస్తూ నిర్ణయించినట్లు యూనియన్ బ్యాంకు అధికారులు పేర్కొన్నారు. ఇతర ఇన్సూరెన్స్ కంపెనీలలో 10 లక్షల బీమా పాలసీ తీసుకోవాలంటే నెలకు కనీసం ఐదు వేలకు పైగా చెల్లించాల్సి ఉంటుంది. అయితే సింగరేణి యాజమాన్యం తీసుకున్న ప్రత్యేక చొరవ వల్ల ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా యూనియన్ బ్యాంకు సహజ మరణానికి 10 లక్షల బీమా పథకాన్ని అమలు జరిపింది. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తం అవుతున్నది. కాగా సింగరేణి సంస్థలో కోటి రూపాయల ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని అమలు జరుపుతున్న ఇతర బ్యాంకులు కూడా ఇదే విధంగా సహజ మరణానికి కూడా బీమా సౌకర్యాన్ని వర్తింప జేసే విధంగా సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకుంటోంది.

# అంగన్వాడి కేంద్రంలో పోషకాహారం పంపిణీ

**పోషకాహార వినియోగం ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు సర్పంచ్ కొర్సా**



**జూలూరుపాడు, మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మండల పరిధి అనంతారం అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ కొర్సా రమేష్ గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు, యువతులకు శనివారం పోషకాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఈనెల 1వ తారీకు నుండి 12వ తారీకు వరకు, 0 నుండి 6 సంవత్సరాల పిల్లలకు పెరుగుదల పర్యవేక్షణ, 14 సంవత్సరాలు పైబడి 18 సంవత్సరాల పెద్ద పిల్లలకు చిక్కీస్, గర్భిణీ స్త్రీలకు పోషకాహారం అందించడం జరుగుతుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషక ఆహార పదార్థాలను ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న గర్భిణీ స్త్రీలు, పిల్లలు, యువతులు ఉపయోగించుకోవాలని కోరారు. తద్వారా పిల్లల ఎదుగుదలకు, గర్భిణీ స్త్రీలకు, యువతులకు అనేక రకాల ఆరోగ్య ప్రయోజనాలు చేకూరుతాయని సర్పంచ్ రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కుంజా రవికుమార్, అంగన్వాడీ టీచర్ సుజాత, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.




# మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు..

**మణుగూరు మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాదరావు**

**మణుగూరు, మహా :** వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మంచినీటి ఎద్దడి తలెత్తకుండా మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో ముందస్తు చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ టీ ప్రసాదరావు తెలిపారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో ప్రత్యేకంగా మాట్లాడారు. గోదావరి నదిలో నీటి ప్రవాహం తగ్గిన నేపథ్యంలో అప్రమత్తమై చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు. చినరాయగూడెం మున్సిపాలిటీ ఇంటెక్ వెల్‌కు గోదావరి నది పాయ దూరంగా ఉండటంతో నీటి సరఫరా సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని గుర్తించి, పరిష్కార చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా విద్యుత్ మోటార్ల ఏర్పాటు చేయడంతోపాటు, దూరంగా ఉన్న నది నీటిపాయ నుంచి ఇంటెక్ వెల్ వైపు నీరు మళ్లించే విధంగా ట్రెంచ్ కొట్టే పనులు చేపట్టినట్లు వివరించారు. మున్సిపాలిటీ పరిధిలోని విట్టల్ రావు నగర్ తో పాటు కొన్ని ప్రాంతాలకు సింగరేణి యాజమాన్యం ద్వారా మంచినీటి సరఫరా జరుగుతుండగా, మిగతా ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎటువంటి అంతరాయం ఏర్పడలేదని స్పష్టం చేశారు. పైపులైన్ల మరమ్మతులు, నిర్వహణ పనులను మున్సిపల్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు కొనసాగిస్తున్నామని కమిషనర్ ప్రసాదరావు పేర్కొన్నారు.

# కన్నెదారి వరప్రసాద్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న సారపాక సర్పంచ్, ఉప సర్పంచ్, పాలకవర్గ సభ్యులు



**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాక పట్టణానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ మరియు రాజా బ్రదర్స్ అయినా కన్నెదారి వరప్రసాద్ నూతన గృహ ప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలియజేసిన సారపాక మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్ మరియు పాలకవర్గ సభ్యులు. ఈ సందర్భంగా సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ మాట్లాడుతూ సామాజిక సేవ దృక్పథంతో ప్రజలతో కలిసి మెలిసి మెలిగే రాజా బ్రదర్స్ లో ఒకరైన వరప్రసాద్ నూతన గృహాన్ని నిర్మించి ఈరోజు కుటుంబ సమేతంగా ప్రజల మధ్య ప్రవేశించడం చాలా సంతోషకరమని అన్నారు. వారి గృహప్రవేశానికి తమతో పాటు పాలకవర్గ సభ్యులను ఆహ్వానించడాన్నీ శుభ పరిణామం అని అన్నారు. వారు వారి పిల్లలు కుటుంబ సభ్యులందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని వారికి దీవెనలు అందించారు ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు మువ్వా వెంకటేశ్వర రావు (లడ్డా), పాటి అశోకు, శిరీష, కొమరం సావిత్రి, పోతిరెడ్డి నవ్య శ్రీ రెడ్డి, బి హైమావతి, లక్ష్మీ ప్రసన్న, కొనకంచి బస్వంతి, తదితరులు పాల్గొన్నారు

# మణుగూరులో యుద్ధ వ్యతిరేక ర్యాలీ..




- ఇరాన్‌పై యుద్ధం ఆపాలని..
- అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్..

**మణుగూరు, మహా :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు కొనసాగిస్తున్న యుద్ధాన్ని తక్షణమే ఆపాలని అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. యుద్ధం పేరుతో గ్యాస్, డీజిల్, పెట్రోల్‌పై కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించకుండా ప్రభుత్వాలు కట్టడి చేయాలని, అలాగే భారత పాలకులు యుద్ధ నియంత్రణకు చిత్తశుద్ధితో గట్టి కృషి చేయాలని కోరారు. ఈ మేరకు మణుగూరు అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో యుద్ధ వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. సురక్ష బస్టాండ్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు జరిగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ప్రపంచ దేశాలపై ఆధిపత్యం సాధించేందుకు యుద్ధాలకు దిగుతున్నాయని ఆరోపించారు. శిలాజ ఇంధనాలు, ఖనిజాలు, జల, భూవనరులను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. 2026 ఫిబ్రవరి 28 నుంచి ఇరాన్‌పై దాడులు కొనసాగిస్తూ ఆయిల్ పరిశ్రమలు, వాటర్ ప్లాంట్లు, విమానాశ్రయాలు, నివాస ప్రాంతాలు, ఆసుపత్రులు, పాఠశాలలపై బాంబులు వేస్తూ వేలాది మందిని హతమారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యుద్ధం ప్రపంచ ప్రజలకే కాకుండా పర్యావరణానికి, భూమండలానికే ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. కార్పొరేట్ల, సామ్రాజ్యవాద శక్తుల అమానవీయ చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఐక్య రాజ్య సమితి నిబంధనలను ఉల్లంఘిస్తూ యుద్ధం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయిల్ నాయకుడు బెంజిమెన్‌లను యుద్ధ నేరస్తులుగా ప్రకటించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పేరు మార్పు

- వికసిత్ భారత్ రోజ్ గార్ అజీవిక హామీ మిషన్ (గ్రామీణ్)
- నూతన నిబంధనల ప్రకారం 125 రోజులు పని కల్పిస్తాం
- ఒక్కో పంచాయతీలో 100 మంది కూలీల లక్ష్యం
- ఏపీడి కుడుముల విజయభాస్కర్ రెడ్డి



**జూలూరుపాడు, మహా:** 2005 నుంచి కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు త్వరలోనే వికసిత్ భారత్ రోజ్ గార్ అజీవికా హామీ మిషన్ ( గ్రామీణ్ ) పేరుతో నూతన నిబంధనల ప్రకారం ఉపాధి కూలీలకు పని కల్పించడం జరుగుతుందని ఆ పథకం కొత్తగూడెం అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (ఏపీడి) కుడుముల విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో ఇప్పటి వరకు 100 రోజుల పని దినాలు ఉండగా, వికసిత్ భారత్ రోజ్‌గార్, అజీవికా హామీ మిషన్ (గ్రామీణ్) పథకంగా చేసిన మార్పులో భాగంగా ఆ పనిదినాలను 125 రోజులకు పెంచటం, రోజుకు కూలీలకు ఇచ్చే కనీస వేతనాన్ని రూ240కి పెంచుతూ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఒక్కో గ్రామపంచాయతీ నుంచి ప్రతి రోజు 100 మంది కూలీలు ఉపాధి పనులకు హాజరయ్యే లక్ష్యంగా ఉపాధి హామీ పథకం సిబ్బంది పనిచేయాల్సి ఉందన్నారు. మారిన నిబంధనల ప్రకారం జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలీకి చెందిన ఈకేవైసీ, ఆధార్ లింక్ ప్రక్రియను కూడా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జియో ట్యాగింగ్ ద్వారా పనులతో పాటు పనుల ప్రదేశాలను గుర్తించిన ప్రకారం పని అంచనాలను ముందుగా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. దీని ప్రకారమే ఈ కేవైసీ పూర్తయిన జాబ్ కార్డు ఉన్న కూలీలకు పని కల్పించడం జరుగుతుందని, తద్వారా పని ప్రదేశంలోనే ప్రతి కూలీకి చెందిన ఫోటోను అప్లోడ్ చేయడం జరుగుతుందని తెలిపారు. కూలీలకు పని కల్పించడంతోపాటు కొలతల్లో తేడా రాకుండా, వారికి సరైన వేతనం అందే విధంగా పూర్తి పారదర్శకంగా పథకం అమలు జరుగుతుందని తెలిపారు. ఈ పథకం ద్వారా పశువులు, మేకల కొట్టాలతో పాటు కోళ్ల పెంపకం పెంపకం కోసం షెడ్లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల కోసం ఉత్సాహవంతులైన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా జరిగే పనులపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ నిరంతరం కొనసాగుతుందని, కూలీలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# కెసిఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి పిరికిపంద చర్య

**ఉద్యమకారుడు భూక్య చందు నాయక్**




**కారేపల్లి, మహా:** మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి గజ్వేల్ శాసనసభ్యులు కెసిఆర్ క్యాంపు కార్యాలయం పై జరిగిన దాడి పిరికిపంద చర్య అని ఉద్యమకారుడు భూక్య చందు నాయక్ ఆరోపించారు. కాంగ్రెస్ పాలనపై వస్తున్న ప్రజా వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ఇటువంటి దాడులను ప్రోత్సహిస్తుందని ఆయన శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. అనేక ఏళ్ల పాటు కొట్లాడి శాంతియుతంగా తెలంగాణను సాధించిన వ్యక్తికి కాంగ్రెస్ ఇచ్చే మర్యాద ఇదేనా అని ఆయన ప్రశ్నించారు. క్యాంపు కార్యాలయాల్లో ముఖ్యమంత్రి ఫోటో లేదన్నది కేవలం సాకు మాత్రమేనని గతంలో కేసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విపక్ష నేతలు చాలా మంది ముఖ్యమంత్రి ఫోటో పెట్టలేదని ఇప్పుడు ప్రధాన మంత్రి ఫోటోను విపక్ష ప్రజా ప్రతినిధులందరూ తమ క్యాంపు కార్యాలయాల్లో పెడుతున్నారా అని చందు నాయక్ ప్రశ్నించారు. గౌరవం అనేది తమ చర్యల ద్వారా లభిస్తుంది తప్ప ఇటువంటి దౌర్జన్యాల ద్వారా కాదన్నారు. కాంగ్రెస్ పార్టీలోనే తీవ్ర అసంతృప్తి రగిలిందని ఒక్కొక్కరుగా ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేస్తున్నారని దాని నుంచి బయట పడేందుకు ప్రజల ఆలోచనను పక్కదారి పట్టించేందుకు ఇటువంటి ప్రేరేపిత ఘటనలకు కాంగ్రెస్ నాయకులు పాల్పడుతున్నారని చందు నాయక్ తెలిపారు. క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని లేని పక్షంలో ఉద్యమకారుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని చందు నాయక్ హెచ్చరించారు. దాడులు చేయడం కాకుండా ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టిసారించాలని ఆయన సూచించారు.



# మణుగూరు ఎస్డిపిఓ రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో.. తోగ్గూడెం వద్ద వాహన తనిఖీలు

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని తోగ్గూడెం ప్రధాన రహదారిపై శనివారం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. డిఎస్పీ వంగా రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో సీఐ పాటి నాగబాబు, ఎస్సై నగేష్ కుమార్, శ్రావణ్ కుమార్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ పత్రాలు తదితరాలను పరిశీలించిన పోలీసులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. అనుమానాస్పద వాహనాలను ప్రత్యేకంగా తనిఖీ చేస్తూ భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు.



# వార్డు సభ్యులకు శిక్షణ

**ఎంపీడీఓ జూలూరుపాడు**

**జూలూరుపాడు, మహా:** మండల వ్యాప్తంగా ఉన్న గ్రామపంచాయతీలలో ఇటీవల జరిగిన ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈనెల ఆరవ తేదీన ఉదయం 10:00 నుండి శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జూలూరుపాడు మండల అభివృద్ధి అధికారి ఆదివారం ఒక పత్రిక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు చెందిన మొత్తం 94 మంది వార్డు సభ్యులు పాల్గొనవలసి ఉంటుందని అన్నారు. గ్రామపంచాయతీల అభివృద్ధి, పంచాయతీరాజ్ చట్టంలోని బాధ్యతలు, ప్రజా సేవల మెరుగుదల వంటి అంశాలపై వారికి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున జూలూరుపాడు మండలంలోని 12 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు తప్పనిసరిగా సమయానికి హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యాలని కోరారు.



## కేసీఆర్ క్యాంపు కార్యాలయంపై దాడి దుర్మార్గం..

**మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు రేగా..**

**మణుగూరు, మహా :** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గజ్వేల్ ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ గూండాలు దాడి చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు తీవ్రంగా ఖండించారు. శనివారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ మేరకు స్పందించారు. మాజీ సీఎం క్యాంపు కార్యాలయానికి కూడా తగిన రక్షణ కల్పించలేని పరిస్థితిలో పోలీసులు ఉన్నారా అని ప్రశ్నించారు. దాడి జరుగుతున్న సమయంలో అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకోకపోవడం సరైన చర్య కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ రోజులు దగ్గరపడుతున్నాయనే భయంతోనే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజలు అభివృద్ధి కోసం అధికారంలోకి తీసుకొస్తే, అరాచకాలకు పాల్పడటం సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమా అని ప్రశ్నించారు. పేదల ఇళ్ళు కూల్చుడు, ప్రతిపక్షాలపై దాడులే ప్రభుత్వ విధానమా అంటూ నిలదీశారు.త్వరలో బీఆర్ఎస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందని, అప్పటివరకు జరిగిన అన్యాయాలకు వడ్డీతో సహా సమాధానం ఇస్తామని హెచ్చరించారు. అభివృద్ధి చేయడమూ తెలుసని, అరాచక శక్తులను కట్టడి చేయడమూ తమకు తెలుసని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యంపై జరిగిన ఈ దాడిని పాలకులు సిగ్గుపడాల్సిన ఘటనగా పేర్కొంటూ, ప్రతిపక్షాలపై దాడులు హీరోయిజం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సూచించారు. ఇటువంటి దాడులకు భయపడబోమని, దాడి చేసిన వారి భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందని రేగా కాంతారావు హెచ్చరించారు.

# సమాజ అభివృద్ధిలో చదువే కీలకం..

**సీఎస్ఐఆర్–ఐఎంఎంటీ డైరెక్టర్ రామానుజ్ నారాయణ్**




**మొయినాబాద్ మహా:** సమాజ అభివృద్ధిలో చదువే కీలకమని ఒడిశాలోని సీఎస్ఐఆర్ పరిధిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మినరల్స్, మెటీరియల్స్ టెక్నాలజీ డైరెక్టర్ డాక్టర్ రామానుజ్ నారాయణ్ తెలిపారు. శనివారం మొయినాబాద్ మున్సిపాలిటీ హిమాయత్ నగర్ లో ఉన్న చైతన్య డీమ్డ్ టు బి యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవానికి ఏపీ మాజీ మంత్రి ఏనుగాల పెద్దిరెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశోధన, సాంకేతికతను ప్రోత్సహించడంలో చైతన్య యూనివర్సిటీ అగ్రగామిగా నిలుస్తోందని ప్రశంసించారు. శాస్త్రీయ నైపుణ్యాన్ని సామాజిక బాధ్యతతో అనుసంధానించాలని సూచించారు. మాజీ మంత్రి పెద్ద రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచం వేగంగా మారుతోందని, కొత్త ఆవిష్కరణలు, కొత్త అవకాశాలు వస్తున్నాయని చెప్పారు. ఈ మార్పులకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని, నేర్చుకోవడం ఎప్పటికీ ఆపవద్దని పిలుపునిచ్చారు. అనంతరం ఐఎంఎంటీ రసాయన శాస్త్రవేత్త పవన్ కుమార్, వర్సిటీ ఛాన్సలర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డితో కలిసి 1,127 మంది డిగ్రీ , పీజీ, బి. టెక్ , బి. ఫార్మసీ , పీహెచ్ డీ విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్ , చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ సాత్విక రెడ్డి , వైస్ ఛాన్సలర్ శంకర్ లింగం, ఓఎస్డీ వీర వెంకటయ్య , రిజిస్ట్రార్ రవీందర్, డీన్స్ రాజు , కవిత , ప్రత్యూష రెడ్డి , సుగంధ దేవి , క్రిస్టోఫర్, జగదీశ్వర్, కుమారస్వామి , సునీత , దేవ్ కుమార్ , అనురాధ , అసిస్టెంట్ రిజిస్ట్రార్ గాదె రాంబాబు రెడ్డి పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నిక
# సుదీర్ఘ నిరీక్షణకు తెర

- మున్సిపల్ చైర్మన్ గా టేకుల సుదర్శన్ రెడ్డి
- వైస్ చైర్మన్ ముత్యాల శ్యామల ఎన్నిక



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ గా బిఆర్ఎస్ అభ్యర్థి టేపుల సుదర్శన్ రెడ్డి, వైస్ చైర్మన్ గా బీజేపీ అభ్యర్థి ముత్యాల శ్యామలను ఎన్నుకున్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియ పోలీస్ బందోబస్తు మధ్య నిర్వహించారు. శనివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలను అధికారులు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ సబ్ కలెక్టర్ మహత్ నారాయణ, జెడ్పి సీఈవో కృష్ణారెడ్డిలు ఎన్నికల ప్రక్రియా సజావుగా నిర్వహించినట్లు అధికారికంగా ప్రకటించారు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో మొత్తం 24 వార్డులు ఉండగా అందులో బిఆర్ఎస్13, కాంగ్రెస్ 8, బిజెపి2, స్వతంత్ర అభ్యర్థి కౌన్సిలర్లుగా ఒక్కరు గెలుపొందారు. అయితే పట్నం చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక గత ఫిబ్రవరి నెల 16, 17వ తేదీలలో జరగాల్సి ఉండగా 19వ వార్డు సభ్యులు ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారని అతని కుటుంబ సభ్యులు ఆరోపించి హైకోర్టును ఆశ్రయించడంతో రెండు సార్లు మున్సిపల్ ఎన్నిక వాయిదా పడింది. నాటి నుండి నేటి వరకు సుమారు 51 రోజుల పాటు బిఆర్ఎస్ కౌన్సిలర్లు క్యాంపు నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికను నిర్వహించాలని ఆదేశించడంతో మున్సిపల్ ఎన్నికల సమావేశానికి ముందుగా స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తో పాటు 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు హాజరై, కోర్టు పరిధిలో మూడు సంఘటనలపై వివాదం కొనసాగుతుందని, ఎన్నికల అధికారులకు సూచించి, ఈ యొక్క ఎన్నికను కాంగ్రెస్ అభ్యర్థులు బహిష్కరిస్తూ సమావేశం నుంచి బయటికి వెళ్లిపోయారు. బిఆర్ఎస్ పార్టీకి మెజార్టీ స్థానాలు ఉండటంతో అధికారులు చైర్మన్ వైస్ చైర్మన్ ఎన్నికను సజావుగా నిర్వహించారు. అనంతరం సభ్యులు చైర్మన్ వైస్ చైర్మన్ ను ఎన్నుకున్నారు. అధికారులు చైర్మన్ వైస్ చైర్మన్ లకు నియామక పత్రాలు అందజేశారు. చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక గత 52 రోజుల సుదీర్ఘ నిరీక్షణకు తెర పడటంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ యొక్క చైర్మన్ ఎన్నికకు మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు ప్రశాంత్ కుమార్ రెడ్డి సత్తు వెంకటరమణ రెడ్డి హాజరయ్యారు.



## కెసిఆర్ నివాసంపై జరిగిన దాడిలో కాంగ్రెస్ గుండాలు...

**బిఆర్ఎస్ నాయకులు మంచర్ల శ్రీనివాస్**

**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, గజ్వేలే ఎమ్మెల్యే కల్వకుంట్ల చంద్ర శేఖర్ రావు అధికార క్యాంప్ కార్యాలయంపై జరిగినదాడిని కాంగ్రెస్ పార్టీ గుండాలు పాల్గొన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్. తీవ్రంగా ఖండించారు.శనివారం గజ్వేలే లో బీఆర్ఎస్ అధినేత కేసిఆర్ క్యాంప్ కార్యాలయం పై కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు గుండాలుగా ప్రవర్తించి అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేయడంతో పాటు గోడలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను ఏర్పాటు చేశారు. జరిగిన తీవ్రమైన దాడిని రాజకీయ అంభావానికి గుర్తుగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ అభివర్ణించారు.తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని ఇలాంటి దౌర్జన్యానికి పాల్పడటం కాంగ్రెస్ పార్టీ అహంకారం, అసహనం, రాజకీయ అసహనాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యంలో రాజకీయ భేదాలు సహజమైనవే గాని, ఇలాంటి దాడులు పూర్తిగా అనర్థం మరియు ఖండనీయమని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ సాధించిన విజయాన్ని జీర్ణించుకోలేక ఈ విధమైన నీచ రాజకీయాలకు దిగడం అత్యంత దురదృష్టకరమన్నారు.ముఖ్యమంత్రి ఫోటోలను బలవంతంగా ప్రభుత్వ లేదా వ్యక్తిగత కార్యాలయాల గోడలపై ఏర్పాటు చేయాల్సిన ఎలాంటి నిబంధనలు లేవని స్పష్టం చేశారు. ప్రజల గుండెల్లో స్థానం సంపాదించాలి గాని, బలవంతపు చర్యల ద్వారా కాదు అని తెలిపారు.ఈ ఘటన పూర్తిగా చట్టవిరుద్ధమైన రాజకీయ దౌర్జన్యమంటు పేర్కొన్నారు. ఇందులో పాల్పడిన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఫుట్పాట్ ఆక్రమణలపై కొరడా జులిపించిన జిహెచ్ఎంసి అధికారులు



**రాజేంద్రనగర్ మహా ;** జిహెచ్ఎంసి అధికారులు ఫుట్పాట్ల ఆక్రమణల పై కొరడా జులిపించారు. శంషాబాద్ జోన్ పరిధిలోని బస్టాండ్ నుంచి రాళ్ల గూడ రోడ్డు వరకు వాణిజ్య సముదాయాలను రెంటుకు తీసుకొని రోడ్డు భాగంలోఫుట్పాట్లను ఆక్రమించి చిరు వ్యాపారులకు రెంటుకిస్తు డబ్బులు దండుకుంటున్నారు.దీంతో రోడ్డుకు ఇరువైపులు, ఇలా చేయడంతో శంషాబాద్ బస్టాండ్ నుంచి రాళ్ల గూడ వెళ్లే రహదారి ట్రాఫిక్ సమస్యతో నిత్యం రద్దీగా మారింది. రోడ్డు ఇరువైపులా ఫుట్పాట్లను ఆక్రమించి వ్యాపారాలుసాగిస్తున్నారు.చిరు వ్యాపారస్తులకు గత కొన్ని నెలలుగా స్వచ్ఛంద అక్రమనకు గురైన ఫుట్పాట్లను తొలగించాలని అధికారులు తెలిపిన ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళ స్వయంగా రంగంలోకి దిగారు. శంషాబాద్ బస్టాండ్ నుంచి రాళ్లు గూడ వరకు రోడ్డుకు ఇరువైపులా వెలిసిన ఫుట్పాత్నిర్మాణాలను జిహెచ్ఎంసి అధికారులు జెసిబిల సహాయంతో భారీ పోలీసు బందోబస్తు మధ్య శనివారం కూల్చివేతలు చేపట్టారు.

## ప్రైవేట్ స్కూలకు అందలం పేరుకే ఇంటిగ్రేటెడ్ స్కూల్

**బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షులు బద్రీనాథ్ గుప్తా**



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నంలో ప్రవేట్ స్కూల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి వర్యులు, ప్రభుత్వ పాఠశాలలకి ఏం మేసేజ్ ఇస్తున్నారో అర్థం కావడం లేదని బద్రీనాథ్ గుప్తా అన్నారు. రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఒక ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు అని చెబుతూ మరోపక్క స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రవేట్ స్కూళ్లను ప్రోత్సహించేలా రిబ్బన్ కటింగ్ లు చెయడం ఎంత వరకు సమంజసమని, మంచాల బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు, వనపర్తి బద్రీనాథ్ గుప్తా ఆరోపించారు. ఇప్పటికే అదిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలకు, రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచేలా ఉందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం కాళ్లు తరిచి పేద ప్రజలకు అండగా నిలిచేలా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించేలా చూడాలని ఆయన సూచించారు.

## తెలంగాణలో అటల్ తికరింగ్ ల్యాబ్స్‌ను ప్రారంభించిన రాష్ట్ర గవర్నర్...




**రాజేంద్రనగర్ మహా ;** తెలంగాణ లో తొలి అటల్ తింకింగ్ ట్యాబ్ ను శంషాబాద్ మండలం కాచారం గ్రామ పరిధిలోని వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల శనివారం ప్రారంభించారు.అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ప్రభావాన్ని పెంచేందుకు రూపొందించిన ఒక ముఖ్యమైన ముందడుగు. ఈ కార్యక్రమం ద్వారా సాధారణ ప్రాప్తి నుండి నిరంతర భాగస్వామ్యానికి మార్పు తీసుకు వచ్చి, బలమైన ఆవిష్కరణ వ్యవస్థను నిర్మించడమే లక్ష్యం.ఈ విధానంలో తెలంగాణలో అన్ని ప్రాంతాల వారీగా క్లస్టర్లుగా విభజించి, ప్రతి క్లస్టర్‌కు ఒక నోడల్ సంస్థను నియమిస్తారు. ఈ సంస్థలు విద్యార్థులకు నిరంతర మార్గదర్శకత్వం వహిస్తారు. ఉపాధ్యాయులకు శిక్షణ, అలాగే ఆవిష్కరణలు, స్టార్టప్‌ల కోసం అవసరమైన మద్దతును అందిస్తాయిన్నారు.ఈ క్రమంలో, వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ను తెలంగాణ రాష్ట్రానికి నోడల్ సంస్థగా ఎంపిక చేశారు. సాంకేతిక విద్య, ఆవిష్కరణలు, వ్యాపారాభివృద్ధి రంగాల్లో ఈ సంస్థకు ఉన్న అనుభవంతో, రాష్ట్రంలోని అటల్ తికిరింగ్ పాఠశాలలకు మద్దతు ఇవ్వడంలో ఇది కీలకంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామీణ స్థాయిలో ఆవిష్కరణలను బలోపేతం చేసి, విద్యార్థులకు భవిష్యత్‌కు అవసరమైన నైపుణ్యాలను అందించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది అన్నారు. అడుగుగా నిలుస్తుంది. రాష్ట్ర గవర్నర్ శివ ప్రసాద్ శుక్ల మాట్లాడుతూదేశం ముందు ఉండాలి. విద్యార్థులు ఆవిష్కరణలపై దృష్టి పెట్టి స్మార్ట్ గా పనిచేయాలి. భారత్ ఒక గొప్ప దేశం, ఇక్కడ నైపుణ్యాలకు కొదవలేదు. మీరు దేశ భవిష్యత్, మేము వర్తమానం. వర్తమానాన్ని మంచి ఆలోచనలు, అవకాశాలతో బలోపేతం చేస్తే, భవిష్యత్ మరింత బలంగా మారుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖలోని అధికారులు వర్ధమాన్ కళాశాల యజమానులు అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




### అంగన్వాడి కేంద్రంల్లో చిన్నారులకు
## సామూహిక అన్నప్రాశన, అక్షరాభ్యాసం

- ఆరోగ్యకరమైన ఆహారాన్ని అంగన్వాడీ కేంద్రాలో తీసుకోవాలి
- సర్పంచ్ కోటేశ్వర్ గౌడ్

**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ మండలం పాలమాకుల గ్రామంలోన అంగన్వాడి కేంద్రంలో చిన్నారులకు గ్రామ సర్పంచ్ కట్కూరి కోటేశ్వర్ గౌడ్ శనివారం అన్నప్రాశన, కార్యక్రమంతో పాటు అక్షరాభ్యాసం నిర్వహించారు.సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆరు నెలల వయసు లోపు చిన్నారులకు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి. ఆరు నెలలు దాటిన వారికి అదనపు ఆహారం, అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చే బాలామృతం ప్రతిరోజు ఇవ్వాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు, 5 సంవత్సరాల లోపు చిన్నారులు అంగన్వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలలో ఇచ్చే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి నిధి పేద ప్రజలకు ఒక వరం...

- నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండి ఆదుకొంటా..
- బాధ్యత కుటుంబాలకు చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్...



**మహా :సదాశివపేట :** ముఖ్యమంత్రి నిధి ప్రజలకు ఒక వరం లాంటిదని నియోజకవర్గప్రజలందరికీ అండగా ఉండే ఆదుకుంటానని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సదాశివపేట పట్టణ18 మండలలకి 26మంది పేద ప్రజలకు 11లక్షల60 వేల500 రూపాయల ముఖ్యమంత్రినిధి చెక్కు లను బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి తన వంతు కృషిఉంటుందని. ప్రజలకు మంచి వైద్య సేవలు అందించేందుకే ముఖ్యమంత్రి నిధి సహకారం తోడ్పడుతుందని. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతానని. ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉండి తన వంతు నిస్వార్థ సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తన మండల పార్టీ అధ్యక్షులు శీల మల్లన్న. పెద్ద గొల్ల ఆంజనేయులు. మాజీ వైస్చైర్మన్ చింత గోపాల్. కౌన్సిలర్లు కొత్త గొల్ల సోమశేఖర్. నసిర్. పార్టీ నాయకులు దిద్దిగి నాగేష్. నాగుల విజయ్ కుమార్. కలీం పటేల్. మన్నే మల్లేశం. వాదోని చంద్రశేఖర్. కామెల్. లతీఫ్. మండల నాయకులు సత్యనారాయణ యాదవ్. ఒగ్గు మానిక్. కోడూరు రాములు. తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సుజాత స్కూల్ గుర్తింపు రద్దు చేయాలి

**ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్**

**మొయినాబాద్ మహా :** మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోనీ సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ అధిక ఫీజులతో పేద మధ్యతరగతి విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని అన్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఫీజులను అధికంగా పెంచడాని నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు ధర్నా నిర్వహించారు. వారి ధర్నాకు భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ ధర్నాలో పాల్గొన్నది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కార్పొరేట్ విద్యా సంస్థ అయిన సుజాత స్కూల్ దాదాపు 33 శాతం ఫీజులను వచ్చే విద్యా సంవత్సరం నుంచి వసూలు చేయాలని చూడడం దుర్మార్గమైన చర్య అని ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల వద్ద ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నారని అని అన్నారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సుజాత ఇంటర్నేషనల్ స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ గారికి డీఈఓ గారికి ఫిర్యాదు చేస్తామని అన్నారు. మండల ఎంఈఓ వెంటనే సుజాత స్కూల్ లో ఫీజులను ఎంక్వయిరీ చేసి పాఠశాల యాజమాన్యానికి నోటీసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాఠశాల ముందు నిరవధికంగా ఆందోళన పోరాట నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మొయినాబాద్ మండల కార్యదర్శి చరణ్ గౌడ్, విద్యార్థుల తల్లిదండ్రులు ,తదితరులు పాల్గొన్నారు.



## రేడియల్ రోడ్డు కొరకు భూసేకరణ

- స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతులు!
- మెరుగైన నష్టపరిహారం అందించే విధంగా ప్రభుత్వం
- రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రేడియల్ రోడ్ ప్రాజెక్ట్ వల్ల కలిగే ప్రయోజనాలను, జిల్లా అదనపు కలెక్టర్, రైతులకు వివరించారు. శనివారం అదనపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డి రేడియల్ రోడ్ 2 కోసం భూసేకరణకు సంబంధించిన పునరావాస పథకం (R&R scheme) నిమిత్తం, చేవెళ్ల డివిజన్ పరిధిలోని షాబాద్ మండలంలో గల షాబాద్, మిడ్డగూడ, కేశవగూడ, సంకేపల్లి, నాగర్‌కుంట & భోనగిరిపల్లి అనే 5 గ్రామాలలో గ్రామసభలను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి భూమిని కోల్పోయిన రైతులతో మాట్లాడి, రేడియల్ రోడ్ ప్రాజెక్ట్ వల్ల కలిగే ప్రయోజనాలను వారికి వివరించారు. చాలా మంది రైతులు సానుకూలంగా స్పందించినప్పటికీ, మెరుగైన నష్టపరిహారం కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా షాబాద్ గ్రామానికి చెందిన కాల్వ రామదేవరెడ్డి రాందేవ్ రెడ్డి రేడియల్ రోడ్ కొరకు తనకు సంబంధించిన 24 గుంటల భూమిని ప్రభుత్వం ప్రతిపాదించిన పరిహారంనకు ఇచ్చుటకు సంసిద్ధత వ్యక్తం చేస్తూ స్వచ్ఛందంగా ప్రభుత్వానికి 24 గంటల భూమిని ఇస్తున్నట్లు లిఖితపూర్వకంగా సంసిద్ధత తెలిపారు.




### వాణిజ్య సముదాయాల యజమానులకు
## నష్టం వాటిల్లకుండా రోడ్డు వెడల్పు చెయ్యండి

**జోనల్ కమిషనర్ కు కాంగ్రెస్ పార్టీ నాయకులవినతి పత్రం...**

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ బస్ స్టాండ్ నుండి రాళ్లగూడ వరకు రోడ్డు వెడలపు పనులు చేస్తున్నారు.ఇరు వైపులా ఉన్న బిల్డింగ్ యజమానులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా చూడాలి.అలా రోడ్డు వేస్త వాణిజ్య సముదాయాల యజమానులు, పట్టణ ప్రజలు, పార్టీల నాయకులు ప్రజా ప్రతినిధులు అందరు సహకరిస్తారానిశంషాబాద్ సర్కిల్ జోనల్ కమిషనర్ చంద్రకళ ని కలసి మాజీ సర్పంచ్ గణేష్ గుప్తా, మాజీ చైర్మన్ దూడల వెంకటేష్, మహేందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మేకల వెంకటేష్, నాయకులు ప్రసాద్, సముదాయాల యజమానుల తో కలిసి శనివారం వినతి పత్రం అందజేశారు.

### విశ్రాంత ఉద్యోగుల సంఘానికి భవనం
## కేటాయించాలని జగ్గారెడ్డికి వినతి

**సంఘ అధ్యక్షుడు నిమ్మాయిల మల్లేశం..**



**మహా, సదాశివపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సదాశివపేట శాఖ అధ్యక్షులు నిమ్మాయిల మల్లేశం సభ్యులు తన కాంగ్రెస్ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం రోజు మన కార్య నిర్వాహక సభ్యులందరూ సంగారెడ్డి వెళ్లి నుండి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గౌరవనీయులు శ్రీ జయప్రకాశ్ రెడ్డి మరియు టిజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి నీ మర్యాదపూర్వకంగా కలిసి కలిసి సదాశివపేటలో విశ్రాంత ఉద్యోగుల సంఘం భవన నిర్మాణ స్థలం గురించి అనుమతి పత్రం ఇప్పించవలసిందిగా కోరడం జరిగింది. అందుకు ఆయన స్పందించి త్వరలోనేసంఘ భవనం నిర్మాణం కోసం తన వంతు కృషి చేస్తామన్నారు. వారి వెంట వెళ్లిన వారిలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు. కౌన్సిలర్ సజ్జి. కాంగ్రెస్ నాయకులు . బిట్ల ప్రేమ్ కుమార్. కోడూరు శరత్ చంద్ర విష్ణువర్ధన్ రెడ్డి. రిటైర్డ్ సంఘం నాయకులు ఈ కార్యక్రమంలో సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి పాల్గొన్నారు

## రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

**ఉప్పల్ కాంగ్రెస్ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి**



**కుషాయిగూడ, మహా :** రాజకీయాలకు తావు లేకుండా అన్ని కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.కాప్రా, శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అభివృద్ధి పనులకు ప్రభుత్వం మంజూరు చేసిన 20 లక్షల నిధుల ప్రొసీడింగ్ కాపీలను శనివారం ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, కాప్రా మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ లు శ్రీ శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, కార్యదర్శి సుభాష్‌రెడ్డికి కి అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగునున్నట్లు తెలిపారు,

### హిమాయత్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో
# ఉచిత వైద్య శిబిరం..




**ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వైద్య శిబిరం..**

**మొయినాబాద్ మహా:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ వార్డు కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరానికి మొయినాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు బేగంబీ, బిల్లపాటీ కవిత ఎల్లేష్, షాబాద్ కిషన్, పలగోల్ల విజయలక్ష్మీ అశోక్ యాదవ్ లు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు వైద్య శిబిరాన్ని సందర్శించి. వైద్యులు అందిస్తున్న సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి కావలసిన మందులను వైద్యులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులకు సూచించారు. ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, వైద్య సిబ్బంది, వార్డుల ప్రజలు, గ్రామ పెద్దలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.







## ఛాన్స్ లు తెచ్చుకుంటున్న పూజాహెగ్డే

సినిమాల్లో లక్కు అవకాశాలను అందించినా, నిలబెట్టేది మాత్రం ప్రతిభనే. అదే శాశ్వత స్థానాన్ని కల్పిస్తుంది. లక్కు, ప్రతిభలో మధ్య ఊగిసలాడుతున్న నటీమణుల్లో పూజాహెగ్డే ఒకరు. పుష్కరం కాలం పాటు కథానాయకిగా కొనసాగుతున్నారు. తెలుగులో అల్లుఅర్జున్ సరసన నటించిన అలవైకుంఠపురంలో, మహేష్‌బాబుకు జతగా నటించ్చిన మహర్షి వంటి చిత్రాలు మంచి విజయాలను సాధించడంతో పూజాహెగ్డేకి ఒక్కసారిగా స్టార్‌డమ్ వచ్చింది. అయితే ఆ తర్వాత నటించిన కొన్ని భారీ చిత్రాలు నిరాశపరచడంతో ఈమెకి అవకాశాలు కరువయ్యాయి. అదే సమయంలో ఈమె నటించిన బీస్ట్ చిత్రం కూడా డిజాస్టర్ అయ్యింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ బ్యూటీని హిందీ చిత్రాలు ఆదుకున్నాయి. అయితే అక్కడ కూడా సరైన విజయం లభించలేదు. ఈమధ్య సూర్యతో నటించిన రెట్రో చిత్ర విజయం పూజాహెగ్డేకు మళ్లీ ఆశలను చిగురింపజేసింది. కూలీ చిత్రంలో ఐటెం సాంగ్‌లో నటించి అలరించారు. ఇలాంటి తరుణంలో మరోసారి విజయ్‌తో జననాయకన్ చిత్రంలో నటించే అవకాశం వరించింది. అయితే ఈ చిత్రం సెన్సార్ సమస్యల్లో చిక్కుకుంది. ఇలాంటి పరిస్థితుల్లో పూజాహెగ్డే ఒక ఇంటర్వ్యూలో పేర్కొంటూ చిత్ర పరిశ్రమలో జయాపజయాలు సరి సమానం అని పేర్కొన్నారు. తాను నటిస్తూ బిజీగానే ఉన్నానని, ఎవరి ఊహాత్మక ప్రశ్నలకు బదులు చెప్పదలుచుకోలేదన్నారు. ప్రస్తుతం తెలుగు, హిందీ భాషల్లో ఒక్క చిత్రంలో నటిస్తున్న పూజాహెగ్డే తమిళంలో ధనుష్‌తో జత కట్టడానికి సిద్ధమవుతున్నారని సమాచారం.

## జపాన్ వేదికపై మరోసారి మెరవనున్న రష్మిక మందన్న...

నేషనల్ క్రష్ రష్మిక మందన్న అంతర్జాతీయ వేదికలపై మరోసారి భారత గౌరవాన్ని చాటారు. జపాన్‌లో జరిగే ప్రతిష్ఠాత్మక క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ లో వరుసగా రెండోసారి ప్రెజెంటర్‌గా ఎంపిక కావడం ద్వారా అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు. ఇప్పటికే 2024లో ఈ అవార్డుల వేదికపై మెరిసిన రష్మిక... ఇప్పుడు మళ్లీ అదే వేదికపై కనిపించబోతున్నారు. దీంతో ఈ అవార్డ్స్‌లో రెండుసార్లు ప్రెజెంటర్‌గా వ్యవహరించిన తొలి భారతీయ సినీ సెలబ్రిటీగా ఆమె చరిత్ర సృష్టించారు. ఈసారి క్రంచీరోల్ యానిమే అవార్డ్స్ 10వ ఎడిషన్ మే 23న టోక్యోలో అంగరంగ వైభవంగా జరగనుంది. యానిమేటెడ్ చిత్రాలు, వెబ్ సిరీస్‌లలో ప్రతిభ కనబరిచిన కళాకారులను సత్కరించే ఈ వేడుక ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాధాన్యం కలిగి ఉంది. ఈ వేడుకలో హాలీవుడ్‌కు చెందిన ప్రముఖులతో కలిసి రష్మిక విజేతలకు అవార్డులు అందజేయనున్నారు. ఆమె పాల్గొనడం వల్ల భారతీయ ప్రేక్షకుల్లో కూడా ఈ ఈవెంట్‌పై ఆసక్తి మరింత పెరిగింది. పుష్ప సినిమాలో 'శ్రీవల్లి' పాత్ర ద్వారా రష్మిక మందన్నకు జపాన్‌లో విశేషమైన క్రేజ్ వచ్చింది. అక్కడి ప్రేక్షకులు ఆమె నటనకు ఫిదా అయ్యారు. సోషల్ మీడియాలో కూడా భారీగా అభిమానులను సంపాదించుకున్నారు. ప్రస్తుతం రష్మిక వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. 'మైసా', 'రణబాలి' వంటి భారీ అంచనాలున్న చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ సినిమాలు త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఆమె కెరీర్ మరో లెవెల్‌కు వెళ్లే అవకాశం ఉందని సినీ వర్గాలు భావిస్తున్నాయి. రష్మిక మందన్న అంతర్జాతీయ వేదికలపై వరుస అవకాశాలు అందుకుంటూ గ్లోబల్ స్టార్‌గా ఎదుగుతున్నారు. భారతీయ నటీమణులకి ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు పెరుగుతున్నాయన్న దానికి ఆమె మరో ఉదాహరణగా నిలుస్తున్నారు.

## సోషల్ మీడియాలో గత్తర లేపుతున్న అనన్య నాగళ్ల..

సినిమాలతో కంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకున్న భామల్లో అనన్య నాగళ్ల ఒకరు. చేసింది తక్కువ సినిమాలే అయిన క్రేజ్ మాత్రం విపరీతంగా సొంతం చేసుకుంది. ఈ అమ్మడి అందానికి కుర్రాళ్లందరూ ఫిదా అయ్యారు. ఈ ముద్దుగుమ్మ తన అందంతో నటనతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. మల్లేశం సినిమాతో హీరోయిన్ గా పరిచయం అయ్యింది ఈ చిన్నది. తొలి సినిమాతోనే నటన పరంగా మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను మెప్పిస్తుంది ఈ ముద్దుగుమ్మ. ఆతర్వాత పవన్ కళ్యాణ్ నటించిన వకీల్ సాబ్ సినిమాతో హిట్ అందుకోవడంతో పాటు వరుస ఆఫర్స్ అందుకుంది. ఆతర్వాత అనన్య చేసిన సినిమాలన్నీ మంచి టాక్ తెచ్చుకున్నాయి కానీ బాక్సాఫీస్ దగ్గర పెద్ద హిట్ గా నిలవలేదు. ఇక ఇప్పుడు ఈ బ్యూటీ సోషల్ మీడియాలో షేర్ చేసే ఫోటోలు కుర్రాళ్లను తెగ కవ్విస్తున్నాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com